http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఆదివారం 24 నవంబర్ 2024

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad






## అలాంటి పరిస్థితి తెలంగాణకు రావొద్దు

- మంత్రి రాజనర్సింహ..
- తొలుత గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంజీఎం వంటి పెద్దపెద్ద ఆస్పత్రుల్లో తనిఖీలు చేసి నివేదికలు తనకు అందించాలి
- ప్రభుత్వ దవాఖానాలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీపై వెంటనే తనిఖీలు నిర్వహించి నివేదిక తయారు చేయాలి

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానాలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీపై వెంటనే తనిఖీలు నిర్వహించి నివేదిక తయారు - మిగతా3లో

## యువతకు ఉపాధి కల్పించడమే

# తన ఉద్దేశం



రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

భూసేకరణ పరిహారం పెంపును కూడా పరిశీలిస్తామని హామీ

కాలుష్య రహిత పరిశ్రమలనే ఏర్పాటు చేస్తామని హామీ

కొడంగల్‌లో ఏర్పాటు చేయబోయేది ఫార్మా సిటీ కాదు... ఇండస్ట్రియల్ కారిడార్ అన్న సీఎం

నా సొంత నియోజకవర్గ ప్రజల్ని నేనెందుకు ఇబ్బంది పెడతాను?

హైదరాబాద్

నా సొంత నియోజకవర్గ ప్రజలను నేనెందుకు ఇబ్బంది పెడతాను అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అలాగే కొడంగల్‌లో ఏర్పాటు చేయబోయేది ఫార్మా సిటీ కాదని, ఇండస్ట్రియల్ కారిడార్ అని వెల్లడించారు. లగచర్ల ఘటనపై నేడు వామపక్ష పార్టీల ప్రతినిధుల బృందం సీఎంకు వినతి పత్రం అందించింది. ఈ సందర్భంగా వారితో సీఎం మాట్లాడుతూ... కొడంగల్ నియోజకవర్గంలో యువతీయువకులకు ఉపాధి కల్పించడమే తన ఉద్దేశమన్నారు. అక్కడ కాలుష్య రహిత పరిశ్రమలనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. భూసేకరణ పరిహారం పెంపును కూడా పరిశీలిస్తామని వెల్లడించారు. భూసేకరణ నేపథ్యంలో గురువారం నాడు వామపక్ష పార్టీల నేతలు వికారాబాద్ జిల్లా లగచర్ల, రోటితండాలలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడి సమస్యలను వారు సీఎం దృష్టికి తీసుకు వెళ్లారు.

**రైతు సదస్సును మూడ్రోజులు నిర్వహించండి**

ప్రజా ప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగా మహబూబ్ నగర్‌లో నవంబర్ 30న జరగనున్న రైతు సదస్సులో అధిక సంఖ్యలో రైతులు పాల్గొనేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. - మిగతా3లో

# గిఫ్ట్‌డీడ్ వైపు మొగ్గు

- గిఫ్ట్ డీడ్‌గా పట్టాలను కుటుంబ సభ్యులకు రాసిచ్చేస్తున్నారు
- రాష్ట్రంలో కొన్నేళ్లుగా పెరిగిన గిఫ్ట్ డీడ్లు
- బీమా, పూచీకత్తు ఇతర ప్రయోజనాలుండటంతో గిఫ్ట్ డీడ్‌లవైపు ఆసక్తి చూపిస్తున్న ప్రజలు
- సర్కారు అమలు చేసేటువంటి రైతు బీమా గిఫ్ట్‌లకు ఒక కారణమైతే సులువుగా హక్కుల బదిలీ ప్రక్రియ ఉండటం కూడా భూ యజమానులు మొగ్గు చూపించేందుకు మరో కారణం




హైదరాబాద్

భూ యజమానులు వారి కుటుంబ సభ్యులకు భూమి యాజమాన్య హక్కులను బదిలీచేస్తున్న తీరు క్రమంగా పెరుగుతోంది. ఇంట్లోని ప్రతి ఫ్యామిలీ మెంబర్‌పై కొంత సాగు భూమి ఉండాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సర్కారు అమలు చేసేటువంటి రైతు బీమా గిఫ్ట్‌లకు ఒక కారణమైతే సులువుగా హక్కుల బదిలీ ప్రక్రియ ఉండటం కూడా భూ యజమానులు మొగ్గు చూపించేందుకు మరో కారణంగా కనిపిస్తోంది. దీంతో పాటు బ్యాంకు పూచీకత్తు(గ్యారంటీ) తదితరాలకు భూమి కీలక ఆధారంగా మారుతుండటం వల్ల కుటుంబ సభ్యులపై కొంత విస్తీర్ణమైనా ఉండాలని భావిస్తున్నారు. దీంతో గిఫ్ట్ డీడ్‌ల సంఖ్య పెరుగుతున్నట్లుగా అంచనా వేస్తున్నారు. 2020కి ముందు సంవత్సరానికి 70 వేల నుంచి 80 వేలలోపు దస్తావేజులు రిజిస్ట్రేషన్ అయ్యేవి. ఆ తరువాత వీటి సంఖ్య ఏటా లక్ష దాటుతోంది. అభ్యంతరాలు తక్కువనే - మిగతా3లో



## ఓయూ సంచలన నిర్ణయం

- హిందీ మహా విద్యాలయ అనుమతులు రద్దు
- స్వయంప్రతిపత్తిని రద్దు చేయాలని యూజీసీకి సిఫార్సు
- ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల కోర్సు పూర్తి చేసేందుకు అవకాశం
- మార్కుల జాబితాలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో నిర్ణయం



## మహారాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు

- మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయంపై ప్రధాని మోదీ స్పందన
- నేడు మహారాష్ట్ర, ఝూర?ండ్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- మహారాష్ట్రలో బీజేపీ కూటమిదే విజయం
- హర్షం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ



## సింగరేణి రిటైర్డ్ కార్మికులకు దీపావళి బోనస్

### త్వరలో ఖాతాల్లోకి : సీఎండీ

హైదరాబాద్

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు సంబంధించిన దీపావళి బోనస్ రూ.18.27కోట్లు ఈ నెల 27న ఖాతాల్లో జమ చేస్తామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరామ్ వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరం, ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 24 మధ్య పని చేసి రిటైర్డ్ అయిన కార్మికులకు సంబంధించి పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు స్కీమ్ (దీపావళి బోనస్) సొమ్మును విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27న ఆయా కార్మికుల ఖాతాల్లో దీపావళి బోనస్ జమవుతుందని సీఎండీ ఒక - మిగతా3లో

## తెలంగాణలో ప్రజా తిరుగుబాటు

# రాబోతోంది

మహారాష్ట్రలో బీజేపీ చరిత్ర సృష్టించింది

ఎన్డీఏ కూటమికే ప్రజలు పట్టం కట్టారు

మహారాష్ట్రలో మోదీ అభివృద్ధి మంత్రం పనిచేసింది

మహారాష్ట్రలో కాంగ్రెస్ ఓటమికి కారణం.. తెలంగాణ, కర్ణాటకలో పాలనే

తెలంగాణ కాంగ్రెస్‌పై బండి సంజయ్ సంచలన ఆరోపణలు

మహారాష్ట్రలో ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా కాంగ్రెస్ కూటమిని నమ్మలేదు.



కరీంనగర్

తెలంగాణ నుంచి మహారాష్ట్ర ఎన్నికల కోసం కాంగ్రెస్ డబ్బులు పంపిందని కేంద్ర మంత్రి, బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ ఓటమికి కారణం.. తెలంగాణ, కర్ణాటకలో పాలనేనని విమర్శించారు. మహారాష్ట్రలో బీజేపీ చరిత్ర సృష్టించిందని బండి సంజయ్ అన్నారు. ఎన్డీఏ కూటమికే ప్రజలు పట్టం కట్టారని చెప్పారు. మహారాష్ట్రలో మోదీ అభివృద్ధి మంత్రం పనిచేసిందని తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మహా సత్య దేవాలయం ఆవరణలో ఇవాళ(శనివారం) కేంద్రమంత్రి - మిగతా3లో



## వాయనాడ్‌లో రాహుల్‌గాంధీ రికార్డు బ్రేక్

- భారీ మెజారిటీతో ప్రియాంకాగాంధీ గెలుపు
- రాహుల్‌గాంధీ సాధించిన 3.64 లక్షల ఓట్ల మెజారిటీయే
- నా గెలుపు మీ విజయమే: ప్రియాంకాగాంధీ
- వయనాడ్ లో 4 లక్షలకు పైగా మెజార్టీతో గెలుపొందిన ప్రియాంక
- వయనాడ్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన ప్రియాంక
- పార్లమెంట్ లో వయనాడ్ గొంతుకనవుతానని వ్యాఖ్య

# ఆదానీ డబ్బులతో బీజేపీ గెలిచింది



**ముంబై :** దేశంలో అత్యంత ధనిక రాష్ట్రమైన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సంచలనంగా మారాయి. ఎవరూ ఊహించని విధంగా బిజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి విజయం సాధించింది. అయితే మహాయుతి కూటమి విజయంపై శివసేన ఉద్ధవ్ బాల్ ఠాక్రే (యుబిటి) కు చెందిన ఎంపీ సంజయ్ రౌత్ అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలను తిరస్కరిస్తూ.. అదానీ ధన బలంతో ఈ ఫలితాలు వచ్చాయని అన్నారు.బిజేపీ కూటమికి 200 సీట్లు ఎలా వస్తాయి. ఇది అసాధ్యం. ఏక్ నాథ్ షిండే పార్టీకి 56-60 సీట్లలో గెలుపు, అజిత్ పవార్ కు 40కు పైగా సీట్లలో గెలుపు ఎలా సాధ్యమవుతుంది. మేము గ్రౌండ్ లెవెల్ లో పనిచేశాం. మాకు ఎన్నికల ఫలితాలపై అంచనా ఉంది. ఇది మహారాష్ట్ర ప్రజల తీర్పు కాదు. అదానీ అండదండలతోనే మహాయుతి విజయం సాధించింది. అంతేకానీ ఈ ప్రజా తీర్పు కాదు. మహారాష్ట్ర ప్రజలు ఏం కోరుకుంటున్నారో మాకు బాగా తెలుసు.మా కూటమి (మహా వికాస్ అఘాడీ)కి 75 సీట్లు కూడా రాలేదంటే ఈ ఎన్నికల ఫలితాలపై అనుమానం కలుగుతోంది. మేము ఈ ఫలితాలను అంగీకరించం. మహారాష్ట్ర ప్రజలు మోసం చేసేవారు కాదు. కానీ బిజేపీ నేతృత్వంలోని మహాయుతి ఎంతటి మోసమైనా చేయగలదు. ఈ ఫలితాలను అదానీ డబ్బుతో కొనుగోలు చేశారు." అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.మహాయుతి ప్రభుత్వం మహిళల కోసం తీసుకొచ్చిన లాడ్లీ బహిన్ (ముద్దల చెల్లెలు) సంక్షేమ పథకం వల్ల ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా మారాయా? అని మీడియా ప్రశ్నించగా?.. "లాడ్లీ బహిన్ కాదు లాడ్లీ భాయ్ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశారు. ఆ లాడ్లీ భాయ్ మరెవరో కాదు అదానీ. ఆయన ధన బలంతోనే గత రెండు లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. ఇప్పుడు కూడా అదానీ ధన ప్రభావంతో మాకు ఈ ఫలితాలొచ్చాయి. ఈ రాష్ట్రంలో ఎవరికైనా 200 సీట్లు వచ్చాయా? శరద్ పవార్ లాంటి నాయకుడికి ప్రజలు 10 సీట్లు మాత్రమే కట్టబెడతారా? విజయం, ఓటమి జరుగుతూ ఉంటాయి. కానీ ఇది ప్రజల తీర్పు కానేకాదు. ఏదో మోసం జరిగింది.అదానీకి నిన్న అరెస్ట్ వారెంట్ జారీ అయింది. అదానీ అవినీతి చేశారని ఆరోపణలు వచ్చాయంటే పరోక్షంగా బిజేపీ చేసిందని, ఏక్ నాథ్ షిండే చేశారని ఆరోపించినట్లే. ఏక్ నాథ్ షిండే, అజిత్ పవార్ కు చెందిన ఎమ్మెల్యేలందరూ ఎలా ఎన్నుకోబడ్డారు?. దేవేంద్ర ఫడ్నవీస్, నరేంద్ర మోడీ, అమిత్ షా.. వీళ్లు మహారాష్ట్ర కోసం ఏం చేశారని బిజేపీకి 120 సీట్లు వస్తాయి? ఈ ప్రశ్న మేము మాత్రమే కాదు ప్రజలు కూడా అడుగుతారు?" అని సంజయ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.మరోవైపు బిజేపీ ఐటీ సెల్ నాయకుడు అమిత్ మాల్వియా ట్విట్టర్ ఎక్స్ లో ఓ పోస్ట్ చేశారు. "ఒక్క ఏక్ నాథ్ షిండే పార్టీకే 56 సీట్లకు వచ్చాయి. ఈ సంఖ్య అన్ని ఇండియా కూటమిలో అన్ని పార్టీలకు వచ్చిన సీట్ల సంఖ్య 49 కంటే ఎక్కువ. జార్జి సోరోస్ అతని కిరాయి మనుషులు సాయం చేసినా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి దేశంలో విజయం దక్కలేదు." అని రాశారు.

## మహారాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి ఘనవిజయం సాధించింది. మహారాష్ట్ర అసెంబ్లీలో 288 స్థానాలు ఉండగా... మ్యాజిక్ ఫిగర్ 145. మ్యాజిక్ ఫిగర్ ను ఎప్పుడో దాటేసిన మహాయుతి కూటమి (బీజేపీ-శివసేన షిండే వర్గం, ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం) 233 స్థానాల్లో విజయం ఖాయం చేసుకుంది. విపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి 50 స్థానాల్లో ముందంజ వేసింది. ఈ నేపథ్యంలో, మహాయుతి కూటమి విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. అభివృద్ధి, సుపరిపాలన గెలిచాయని పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక విజయం అందించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మహారాష్ట్ర ఓటర్లు, మహిళలు, యువతకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని వెల్లడించారు. ఐక్యంగా ఉండడం వల్ల మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్ర అభ్యున్నతికి మహాయుతి కూటమి కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఇక, ఝార?ండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపైనా ప్రధాని స్పందించారు. ఝార?ండ్ లో అధికార జేఎంఎం కూటమి విజయం సాధించినందుకు అభినందనలు అంటూ ట్వీట్ చేశారు. అయితే, విపక్షంగా ప్రజల సమస్యలను లేవనెత్తడంలో, రాష్ట్రం కోసం పనిచేయడంలో ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ మేరకు ప్రధాని మోదీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. కాగా మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అధికార కూటమి 220కి పైగా స్థానాల్లో విజయం సాధించింది. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కేవలం 50 స్థానాలకు పరిమితమైంది. ఇతరులు ఐదు స్థానాల్లో గెలిచారు.

# షిండే వర్సెస్ ఫడ్నవిస్



**ముంబై :** మహారాష్ట్రలో విజయం సాధించిన మహాయుతిలో సీఎం పదవిపై పితలాటకం మొదలైనట్టే కనిపిస్తోంది. కూటమిలో అనూహ్యంగా భారీ విజయాన్ని బీజేపీ అందుకోవడంతో సీఎం పదవిపై ఆ పార్టీ ఫోకస్ చేసింది. అంతే కాకుండా షిండే నేతృత్వంలోనే శివసేన అనుకున్న మేజార్టి సాధించకపోవడం కూడా ఇక్కడ కీలకంగా మారింది. సీఎం పదవిపై దేవందర్ ఫడ్నవీస్‌కు కట్టబెట్టాలని బీజేపీ ఆలోచనగా ఉన్నట్టు గ్రహించిన ఏక్‌నాథ్ షిండే కీలకవ్యాఖ్యలు చేశారు. సీట్లకు సీఎం కుర్చీకి సమబంధం లేదని అన్నారు. మహాకూటమిలో ఎక్కువ సీట్లు వచ్చే పార్టీ నేతే ముఖ్యమంత్రి కావాలని మేం నిర్ణయించుకోలేదన్నారు షిండే . ముందుగా ఎన్నికల ఫలితాల తుది గణాంకాలను వచ్చాక చర్చిస్తాం. సీట్ల పంపకాల చర్చకు మూడు పార్టీలు కూర్చున్నట్లు కలిసి కూర్చుంటాం. ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జేపీ నడ్డా, మూడు పార్టీల సీనియర్ నేతలు ఒకే చోట కూర్చుని చర్చించనున్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన విధంగానే ముఖ్యమంత్రి పదవిపై కూడా కలిసి చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఏక్‌నాథ్ షిండే చెప్పారు. ముఖ్యమంత్రి పదవిపై తన వాదనను అంత తేలిగ్గా వదులుకోనని ఏకనాథ్ షిండే ప్రకటన సూచిస్తోంది. డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ సీఎం పదవిపై కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఎవరూ ఊహించనట్టు వచ్చాయన్నారు. తామెవరూ ఊహించలేదన్నారు. అంచనాలకు మించినవిగా అభిప్రాయపడ్డారు. త్వరలోనే పార్టీ నేతలు కూర్చొని తదుపరి వ్యూహాన్ని సిద్ధం చేస్తామన్నారు. మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు ఫడ్నవీస్. మూడు పార్టీలు కలిసి సీఎంను నిర్ణయిస్తాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు.డిప్యూటీ సీఎం, బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ తల్లి సరితా ఫడ్నవీస్ మాట్లాడుతూ.. 'తన బిడ్డ తప్పకుండా సీఎం అవుతాడని అన్నారు. ఇది చాలా పెద్ద రోజని అన్నారు. తను 24 గంటలు కష్టపడి పనిచేశాడని గుర్తు చేశారు. మరోవైపు పవార్ ఫ్యామిలీ కూడా అజిత్ పవార్ సీఎం రేసులో ఉంటారని ఆశాభావంతో ఉన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సీఎం ఏక్నాథ్ షిండే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్‌తో ఫోన్‌లో మాట్లాడి విజయంపై అభినందనలు తెలిపారు.మహాయుతి శాసనసభా పక్ష సమావేశం ఆదివారం జరగనుంది. నవంబర్ 25న బీజేపీ శాసనసభా పక్ష నేత ఎన్నిక జరగనుంది. నవంబర్ 26న ప్రభుత్వం ఏర్పాటు కానుంది. బీజేపీ పరిశీలకుడు ఆదివారం ముంబైకి రానున్నారు.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి మెజారిటీ మార్కు దాటి దూసుకెళ్లింది. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి 200పైగా స్థానాల్లో విజయం ఢంకా మోగించేందుకు సిద్ధమైంది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఓఎం 58 స్థానాలకే పరిమితమైంది. ఇతరలు 13 స్థానాల్లో ఆధిక్యం కనబరిచారు. ముంబైలోని 36 సీట్లలో మహాయుతి 22 స్థానాల్లో, ఓఎం 10, ఇతరులు 1 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు. పశ్చిమ మహారాష్ట్రలోని 58 సీట్లలో మహాయుతి 34 స్థానాల్లో, ఎంవీఏ 4, ఇతరులు 4 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు. ఉత్తర మహారాష్ట్రలోని 47 స్థానాల్లో మహాయుతి 36 స్థానాల్లో, ఎంవీఏ 6, ఇతరులు 5 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు.థానే కొంకణ్ ప్రాంతంలోని 39 స్థానాల్లో మహాయుతి 33 స్థానాల్లో, ఎంవీఏ 4 స్థానాల్లో, ఇతరులు 2 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు. మరాఠ్వాడాలోని 46 స్థానాల్లో మహాయుతి 34 స్థానాల్లో, ఎంవీఏ 11 స్థానాల్లో, ఇతరులు 1 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు. విదర్భలోని 62 స్థానాల్లో మహాయుతి 47 స్థానాల్లో, ఎంవీఏ 14 స్థానాల్లో, ఇతరులు 1 సీటులో ఆధిక్యంలో ఉన్నారు.

## లక్షల మంది ఫాలోవర్లు..
## ఎమ్ఎల్ఏగా పోటీ చేయగా..

**తెలుగు సినిమా విలన్‌కు ఇలా జరిగిందేంటీ..**



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు సినిమా విలన్‌కు దిమ్మతిరిగే షాక్ తగిలింది. ఆ వ్యక్తి అనేక తెలుగు సినిమాల్లో విలన్‌గా నటించాడు. ఇన్‌స్టాలో ఏకంగా 5.6 మిలియన్ ఫాలోవర్లు కూడా ఉన్నారు. అంతేకాకుండా బిగ్ బాస్ షోలో పాల్గొని ఎంతో పాపులారిటీని సొంతం చేసుకున్నాడు. అయినా ఆ సెలబ్రిటీకి మాత్రం మహారాష్ట్ర ఓటర్లు షాక్ ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. దూకుడు, బాద్‌షా, టెంపర్, హార్ట్‌ఎటాక్ తదితర తెలుగు సినిమాల్లో విలన్‌గా నటించిన అజాజ్ ఖాన్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 5.6 మిలియన్ ఫాలోవర్లు ఉన్నారు. అలాగే బిగ్ బాస్ షోతో కూడా అమితమైన పాపులారిటీని సొంతం చేసుకున్నాడు. ఆ క్రేజ్‌ను క్యాష్ చేసుకుని ఎలాగైనా ఎమ్ఎల్ఏగా గెలవాలని.. వెర్సోవా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆజాద్? సమాజ్ పార్టీ (కాన్షీరామ్) తరఫున పోటీ చేయగా దిమ్మతిరిగే షాక్ తగిలింది. ఈ ఎన్నికల్లో అజాజ్ ఖాన్‌కు కేవలం 155 ఓట్లు మాత్రమే దక్కాయి. అంత పాపులారిటీ ఉన్న ఇతడికి ఇంత ఘోరంగా ఓట్లు రావడంతో ఈ అంశం ప్రస్తుతం మహారాష్ట్రలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ నియోజకవర్గం నుంచి శివసేన అభ్యర్థి హరూన్ ఖాన్ 65వేలకు పైగా ఓట్లతో ఘన విజయం సాధించగా.. 63వే పైచిలుకు ఓట్లతో బీజేపీ అభ్యర్థి డాక్టర్ భారతి లావేకర్ రెండో స్థానంలో నిలిచారు. ఇక్కడ నోటాకు 1298 ఓట్లు రాగా.. అజాజ్ ఖాన్‌కు నోటా కంటే తక్కువ రావడం కొసమెరుపు. కాగా, ఈ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు వివిధ రకాలుగా స్పందిస్తున్నురు. "ఫాలోయింగ్స్, క్రేజ్ ఉంది కదా అని విర్రవీగితే చివరకు ఇలాంటి ఫలితమే దక్కుతుంది".. అంటూ కొందరు, "ఫాలోవర్స్ మొత్తం ఓట్లుగా మారతానుకుంటే పొరపాటే".. అంటూ మరికొందరు, వివిధ రకాల ఎమోజీలతో ఇంకొందరు కామెంట్లు చేస్తున్నారు.

## బెంగాల్ ఉప ఎన్నికల్లో మమత క్లీన్ స్వీప్...
### ఖాతా తెరవని బీజేపీ

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ మమతా బెనర్జీ సారథ్యంలోని అధికార తృణమూల్ కాంగ్రెస్ తమకు తిరుగులేదని చాటుకుంది. ఎన్నికలు జరిగిన 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ టీఎంసీ విజయకేతనం ఎగురవేసింది. దీంతో ఉపఎన్నికల్లో టీఎంసీ క్లీన్ స్వీప్ సాధించినట్టయింది. విపక్ష బీజేపీ ఖాతా తెరువకుండానే చతికిలపడింది. సాంప్రదాయకంగా బీజేపీకి కంచుకోటుగా ఉన్న మదారిహత్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని సైతం ఈసారి టీఎంసీ తమ ఖాతాలో వేసుకుంది. 2021 ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి 29,000 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ గెలిచింది. అలిపుర్దూర్ నుంచి బీజేపీ ఎంపీగా లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన మనోజ్ టిగ్గా.. మదారిహత్ అసెంబ్లీ సీటును వదులుకోవడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. తాజాగా జరిపి ఆ నియోజకవర్గం ఉప ఎన్నికలో టీఎంసీ అభ్యర్థి జయప్రకాష్ టొప్పో 28,000 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. సితాయి నియోజకవర్గం నుంచి టీఎంసీ అభ్యర్థి సంగీత రాయ్ 1.3 లక్షల ఆధిక్యంతోనూ, నైహతి నుంచి టీఎంసీ అభ్యర్థి సనత్ దే 50,000 ఓట్ల అధిక్యంతోన, హరోయా నుంచి టీఎంసీ అభ్యర్థి షేక్ రబియుల్ ఇస్లామ్ 1.3 లక్షల ఆధిక్యంతోనూ గెలిచారు. మేదినిపూర్ నుంచి టీఎంసీ నేత సుజయ్ హజ్రా 34,000, తల్డంగ్రా నుంచి టీఎంసీ నేత ఫల్గుణి సింఘబాబు 34,000 ఓట్ల ఆధిక్యంతోనూ గెలుపొందారు.. కాగా, టీఎంసీ 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ క్లీన్ స్విన్ చేయడంతో టీఎంసీ కార్యకర్తలు సౌత్ కోల్‌కతాలోని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నివాసం వెలుపల సంబరాలు జరుపుకొన్నారు. టీఎంసీకి నిరంతరం మద్దతుగా నిలుస్తూ విజయాలను అందిస్తున్ను ప్రజలకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సామాజిక మాధ్యం 'ఎక్స్'లో కృతజ్ఞతలు తెలిపారు. విజేతలకు అభినందనలు తెలిపారు.

# శివసేన, ఎన్‌సీపీలు ఎవరివో తేల్చేసిన ప్రజలు



**ముంబై :** మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలతో అక్కడి ప్రజలు ప్రభుత్వం ఎవరు ఏర్పాటు చేయాలో మాత్రమే కాదు..రెండు పార్టీల్లో అసలైన పార్టీ ఏదో కూడా తేల్చేశారు. ఆ రెండు పార్టీలు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, శివసేన, అటు కాంగ్రెస్ పార్టీ కూటమిలో ఈ పార్టీలు ఉన్నాయి. బీజేపీ కూటమిలోనూ ఈ పార్టీలు ఉన్నాయి. అయితే చీలక వర్గం, అసలైన పార్టీ మాదేనని రెండు పార్టీలు వాదిస్తూ వచ్చాయి. చివరికి ప్రజలే ఈ అంశంలో తీర్పులు ఇచ్చారు. ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలు కాదని.. పార్టీలకే ఓటు వేశారు. అసలైన పార్టీలుగా ఈసీ గుర్తింపు నిచ్చిన అజిత్ పవార్ ఎన్సీపీ, శిందే శివసేనలను గుర్తించారు. ఉద్ధవ్ థాక్రే రాజకీయ జీవితంలో ఇదే అది పెద్ద పరాజయం. తన తండ్రి బాల్ థాక్రేనుంచి రాజకీయవారసత్వం అందుకున్న ఉద్ధవ్ థాక్రే.. తర్వాత సిద్ధాంతాలకు దూరంగా జరిగారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేసి కాంగ్రెస్ పార్టీతో పొత్తులు పెట్టుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. మొదట ఆయనతో కలిసిన ఏక్ నాథ్ షిండే సహా ఇతర నేతలు తరవాత పార్టీ నుంచి విడిపోయి.. సొంత కుంపటి పెట్టుకున్నారు.దాదాపుగా ఎమ్మెల్యేలు, ఎంపీలంతా వెళ్లిపోయారు. దాంతో వారిదే అసలైన శివసేనగా కోర్టు, ఈసీ నిర్ణయించాయి. పార్లమెంట్ ఎన్నికల్లో ఉద్ధవ్ వర్గానికి ఎక్కువ సీట్లు రావడంతో అసెంబ్లీ ఎన్నికల్లోనూ అవే ఫలితాలు వస్తాయనుకున్నారు. కానీ షిండే వర్గానికి ఎక్కువ సీట్లు రావడంతో అసలైన శివసేన శిందే చేతుల్లోకి శాశ్వతంగా వెళ్లిపోయినట్లయింది.ఈ ఎన్నికల తర్వాత రిటైర్మెంటేనని సంకేతాలు ఇచ్చిన శరద్ పవార్ పార్టీ కూడా అచ్చం శివసేన లాంటి పరిస్థితినే ఎదుర్కొంది. కాంగ్రెస్ నుంచి విడిపోయి నేషనలిస్ట్ కాంగ్రెస్పార్టీని పెట్టుకున్న ఆయన నుంచి ఆయన మేనల్లుడు అజిత్ పవార్ పార్టీని లాక్కున్నారు. అత్యధిక మంది ప్రజాప్రతినిధులు ఆయన వెనుకే ఉండటంతో ఆయనతే అసలైన ఎన్సీపీగా గుర్తించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఒకే ఒక్క ఎంపీ సీటు గెల్చుకుని ప్రజలు అంతా అజిత్ పవార్ ను తిరస్కరించారని అనుకున్నారు.కానీ అసెంబ్లీ ఎన్నికల్లో శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి ఘోరపరాజయం ఎదుయింది. అసలైన ఎన్సీపీగా అజిత్ పవార్ నేతృతంలోని పార్టీనే ప్రజలు గుర్తించారని అనుకోవచ్చు. ప్రస్తుత ఫలితాల్లో మహారాష్ట్రలో గందరగోళంగా మారిన రాజకీయంలో పునరేకీకరణ అయ్యే అవకాశం కనిపిస్తోంది.ఉద్ధవ్, శరద్ పవార్ పార్టీల్లో గెలిచిన వారు కూడా ఇప్పుడు తమ మాతృపార్టీల్లోకి వెళ్లిపోయే అవకాశాలు ఉన్నాయి. ఏదైమైనా శివసేన అంటే థాక్రేలది అన్న అభిప్రాయాన్ని ప్రజలు మార్చేశారు. శరద్ పవార్ పార్టీని ప్రజలే అజిత్ పవార్‌కు అప్పగించినట్లయింది.

## వాయనాడ్‌లో రాహుల్‌గాంధీ రికార్డు బ్రేక్..



కేరళ రాష్ట్రంలోని వాయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సోనియాగాంధీ తనయ ప్రియాంకాగాంధీ వాద్రా ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, సీపీఐ అభ్యర్థి సత్యన్ మొకేరిపై 4,08,0036 ఓట్ల మెజారిటీతో ఆమె భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. దాంతో వాయనాడ్ లోక్‌సభ స్థానంలో అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిచిన అభ్యర్థిగా ఆమె రికార్డు నెలకొల్పారు. గతంలో ఈ రికార్డు ప్రియాంకాగాంధీ సోదరుడు రాహుల్‌గాంధీ పేరిట ఉంది. రాహుల్‌గాంధీ సాధించిన 3.64 లక్షల ఓట్ల మెజారిటీయే ఆ నియోజకవర్గంలో ఇప్పటివరకు అత్యధిక మెజారిటీగా ఉంది. ఇప్పుడు 4.08 లక్షల ఓట్ల మెజారిటీతో ప్రియాంకాగాంధీ ఆ రికార్డును బద్దలు కొట్టారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ తన సిట్టింగ్ స్థానమైన వాయనాడ్‌తోపాటు, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి బరిలో దిగారు. రెండు స్థానాల్లో ఆయన విజయం సాధించారు. దాంతో ఆయన వాయనాడ్ లోక్‌సభ స్థానానికి రాజీనామా చేశారు. ఆ తర్వాత నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆ స్థానంలో తన సోదరి ప్రియాంకాగాంధీని బరిలో దించారు. వాయనాడ్ ఓటర్లు ఆమెను భారీ మెజారిటీతో గెలిపించారు.

**నా గెలుపు మీ విజయమే**

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ తన తొలి ఎన్నికల సమరంలోనే ఘన విజయాన్ని అందుకున్నారు. వయనాడ్ లోక్ సభ ఉపఎన్నికలో 4,08,036 ఓట్ల మెజార్టీతో ఆమె అద్భుత విజయాన్ని సాధించారు. తన విజయంపై ప్రియాంక స్పందిస్తూ... వయనాడ్ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. మీరు నాపై ఉంచిన నమ్మకానికి ఎంతో సంతోషిస్తున్నానని చెప్పారు. ఈ విజయం మీదేనని అన్నారు. పార్లమెంట్ లో మీ గొంతుకనవుతానని... వయనాడ్ గళం వినిపించేందుకు ఎదురుచూస్తున్నానని చెప్పారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. మరోవైపు సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దీంతో, సోమవారమే ఎంపీగా ప్రియాంకాగాంధీ ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది. తన సోదరుడు రాహుల్ గాంధీతో కలిసి లోక్ సభలోకి ప్రవేశించి... ఎంపీగా ఆమె ప్రమాణస్వీకారం చేయనున్నట్టు సమాచారం. గాంధీ కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు పార్లమెంట్ ఉభయ సభల్లో ఉండటం గమనార్హం. ఇప్పటికే రాహుల్ గాంధీ లోక్ సభలో, సోనియాగాంధీ రాజ్యసభలో సభ్యులుగా ఉన్నారు. ఇప్పుడు ప్రియాంక లోక్ సభలోకి అడుగుపెట్టబోతున్నారు.

# అలాంటి పరిస్థితి తెలంగాణకు రావొద్దు

-మొదటిపేజీ తరువాయి

చేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణపై ఆరోగ్యశాఖ అధికారులతో మంత్రి రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం ఝాన్సీలోని మహారాణి లక్ష్మీబాయి మెడికల్ కాలేజీ అగ్నిప్రమాదంపై రాజనర్సింహ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ ప్రమాదంలో 10మంది చిన్నారులు మృతిచెందడంపై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజనర్సింహ అధికారులను అప్రమత్తం చేశారు. ఇలాంటి ఘటనలు తెలంగాణలో చోటు చేసుకోకుండా చూడాలని, అందుకు ముందుగానే అన్ని ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీపై తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల కోసం వెంటనే పది బృందాలను ఏర్పాటు చేయాలని సూచనలు జారీ చేశారు. తొలుత గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంజీఎం వంటి పెద్దపెద్ద ఆస్పత్రుల్లో తనిఖీలు చేసి నివేదికలు తనకు అందించాలని మంత్రి



రాజనర్సింహ తెలిపారు. ప్రతీ ఆస్పత్రిలో ఫైర్ అలార్మ్, స్మోక్ట్ డిటెక్టర్స్ ఉన్నాయా లేవా అనేది పరిశీలించాలని అధికారులకు మంత్రి చెప్పారు. ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదాలు సంభవించి మంటలు ఏర్పడితే ఆర్పే యంత్రాలు సరిపడా ఉన్నాయో, లేవో? చూడాలని.. వాటి తుది గడువు తేదీలను సైతం చెక్ చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే మంటలు ఆర్పే యంత్రాల వినియోగంపై ఆస్పత్రి సిబ్బంది, సెక్యూరిటీకి శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఆరోగ్య కేంద్రాల్లో పవర్ సప్లై సిస్టమ్‌ను సైతం పరిశీలించాలని సూచించారు. ఆస్పత్రి భవనంలో పాత ఎలక్ట్రిక్ వైర్లు ఉంటే వాటి స్థానంలో నాణ్యమైన కొత్త కేబుల్స్ ఏర్పాటు చేయాలని మంత్రి సుస్పష్ట ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఫైర్ సేఫ్టీ, షార్ట్ సర్క్యూట్‌కు సంబంధించి చేయాల్సిన, చేయకూడని పనుల గురించి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి చెప్పారు. సమీపంలోని అగ్నిమాపక శాఖ సిబ్బందితో ఆస్పత్రి అధికారులు సంబంధాలు కలగి ఉండాలని తెలిపారు. ఆస్పత్రి భవనాల్లో తరచుగా ఫైర్ సేఫ్టీ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని అధికారులకు రాజనర్సింహ చెప్పారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే సురక్షితంగా బయటకు వచ్చేందుకు భవనం ప్లాన్‌కు సంబంధించిన సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు.

# ఆ పిల్లల కుటుంబాలకు 10 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి

ప్రభుత్వ పాఠశాలల్లో పది రోజులకో పసిబిడ్డ ప్రాణం పోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పసి బిడ్డల ప్రాణాలను ప్రాధాన్యతగల అంశంగా స్వీకరించి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు ఏ ఒక్క పాఠశాలను చూసినా ఏదో ఒక సంఘటన జరిగిన దాఖలాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల వ్యవస్థ ధ్వంసమైన పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. మరణించిన 42 మంది పిల్లల కుటుంబ సభ్యులకు రూ 10 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజను, ఆమె కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ%%% తరుచూ ఇలాంటి ఘటనలు జరుగుతుండటం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పసిబిడ్డల ప్రాణాలు పోతుంటే ప్రభుత్వం పట్టనట్టు ఉండటం సరికాదని సూచించారు. "ప్రభుత్వం వచ్చి 11 నెలలు అవుతుంది, సగటున నెలకు ముగ్గురు చొప్పున ఇప్పటి వరకు 42 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బిడ్డలు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆహారం విషతుల్యమై మరణించారు. సగటున పదిరోజులకు ఒక పసి ప్రాణాన్ని ప్రభుత్వం పొట్టన పెట్టుకుంటోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని సంక్షేమ శాఖలు కూడా ముఖ్యమంత్రి వద్ద



ఉండటం వల్ల సమయం వెచ్చించలేకపోతున్నట్లు కనిపిస్తోందని అన్నారు. కనీసం పది నిమిషాల సమయాన్ని కేటాయించి సమీక్ష చేస్తే పసి ప్రాణాలను కాపాడే పరిస్థితి ఉంటుందని సూచించారు. నారాయణపేట హాస్టల్లో ఫుడ్ పాయిజన్ కారణంగా పిల్లలు అనారోగ్యం పాలైన తర్వాత ముఖ్యమంత్రి సమీక్ష చేసిన మరునాడే అలాంటి మరో సంఘటన జరగడం ఆందోళనకరమని అన్నారు. పిల్లలు కూడా ధర్నా చేస్తున్నారని గుర్తు చేశారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు ఐఐటీ, ఐఐఎంకు వెళ్లాలా లేకపోతే ఎవరెస్టు అధిరోహించాలా అన్న ఉన్నతమైన ఆశయాలు, లక్ష్యాలతో వెళ్లిన సందర్భాన్ని తెలంగాణ సమాజం చూసిందని గుర్తు చేశారు.

# మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడమే లక్ష్యం'

**హైదరాబాద్ :** అపరిమితమైన శక్తి సామర్థ్యాలు ఉండి కూడా తాము బలహీనులమని భావిస్తూ ఇంటికే పరిమితమవుతున్న మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహించడం లక్ష్యంగా తాను ముందుకు సాగుతున్నట్లు ఆరుపదుల వయసులో మిస్సెస్ ఇంటర్నేషనల్ పీజెంట్ టైటిల్‌ను కైవసం చేసుకున్న విద్యావేత్త డాక్టర్ విజయ శారదా రెడ్డి అన్నారు. బ్యాంకాక్‌లో జరిగిన క్లాసిక్ మిస్సెస్ ఏషియా ఇంటర్నేషనల్ 2024 పోటీలలో పాల్గొని టైటిల్ కైవసం చేసుకున్న సందర్భంగా బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని చిరు గ్రామంలో జన్మించిన తనకు డిగ్రీ రెండవ సంవత్సరంలోనే వివాహం జరిగిందని అన్నారు. భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యను పూర్తి చేసి విద్య ద్వారానే విజ్ఞానం లభిస్తుందని బలంగా నమ్మి విద్యాసంస్థలను నెలకొల్పినట్లు చెప్పారు. అనంతరం వయస్సు కేవలం శరీరానికే.. మనసుకి కాదని ప్రతి మహిళకు వివరించే లక్ష్యంతో ఆరుపదల వయసులో అందాల పోటీలకు సిద్ధమైనట్లు చెప్పారు. భర్త, కుమారులు, కోడలు సైతం తన నిర్ణయాన్ని సమర్థించి ప్రోత్సహించడంతో అంతర్జాతీయ వేదికపై టైటిల్‌ను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ఇది కేవలం తన కోసం చేసింది కాదని చిన్న చిన్న కారణాలతో ఇంటికి



పరిమితం అవుతున్న మహిళలలో అంతర్లీనంగా ఉన్న శక్తిని ప్రేరేపించే లక్ష్యంతో చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి మహిళ తనకు నచ్చిన రంగంలో అద్భుతంగా రాణించి కుటుంబానికి, దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారామె.

# కేసీఆర్ రికార్డు బ్రేక్ చేస్తున్న కేటీఆర్.. కాంగ్రెస్ నేత షాకింగ్ కామెంట్స్

**హైదరాబాద్:** మాజీ మంత్రులు కేటీఆర్ హరీష్‌రావు అబద్ధాలు చెప్పడంలో పోటీ పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టుసాయి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణకు అవార్డు వస్తే మాజీ సీఎం కేసీఆర్ వల్లే అవార్డు వచ్చిందని కేటీఆర్ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. దినం దినం కేటీఆర్ దిమాక్ చిన్నగా అవుతోందని విమర్శలు చేశారు. ఇవాళ(శనివారం) గాంధీభవన్‌లో మెట్టుసాయి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేటీఆర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రగ్స్, తాగడం వల్లనో కానీ కేటీఆర్ పిచ్చోడిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మెదడుకు చిల్లు పడితే తమ ప్రభుత్వం తరపున వైద్యం చేయిస్తామని అన్నారు. కేటీఆర్ మాటలకు మత్స్యకారులు నవ్వుతున్నారని విమర్శించారు. అబద్దాల యూనివర్సిటీలో పట్టా పొందిన వ్యక్తి కేటీఆర్ అని దెప్పిపొడిచారు. దాచేసిన సత్యం అంటూ అసలు సత్యాన్ని కేటీఆర్ దాచేశారని ఆరోపించారు.కేటీఆర్ జీవితంలో ఒక్కరోజైనా అబద్ధాలు



చెప్పకుండా ఉంటాడా అని ప్రశ్నించారు. కేసీఆర్ అబద్దాల రికార్డు బ్రేక్ చేసేందుకు కేటీఆర్ కష్టపడుతున్నారని అన్నారు. తమ హయాంలో చేసిన పనిని కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తే అది తమ ఘనత అంటూ కేటీఆర్ చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఇందిరా మహిళా శక్తికి అవార్డు వచ్చింది. అది ఎవరిదో కేటీఆర్ చెప్పాలని అన్నారు. రేవంత్ ప్రత్యేక శ్రద్ధతో మహిళాభివృద్ధికి పథకం తీసుకువస్తే ఆ క్రెడిట్ మీరు తీసుకుంటారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మహిళలకు ఇచ్చిన సబ్సిడీని తాము పెంచామని గుర్తుచేశారు. 32 మొబైల్ ఫిష్ క్యాంటీన్లు ప్రారంభించామని గుర్తుచేశారు. రాష్ట్రానికి ఆదాయాన్ని పెంచేందుకు తీసుకున్న నిర్ణయాలకు తమకు అవార్డు వచ్చిందని తెలిపారు. బీమా పథకం ద్వారా 4 లక్షల 16 మంది సభ్యుల జీవితాలు కాపాడేందుకు రూ.139 కోట్లు ప్రీమియం చెల్లించినందుకు అవార్డు వచ్చిందని మెట్టుసాయి పేర్కొన్నారు.

## సింగరేణి రిటైర్డ్ కార్మికులకు దీపావళి బోనస్..

-మొదటిపేజీ తరువాయి

ప్రకటనలో వెల్లడించారు. దాదాపు 2,754 మంది కార్మికులకు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.93,750 చొప్పున మొత్తంగా రూ.18.27కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27న రిటైర్డ్ కార్మికుల ఖాతాల్లో జమ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆర్థిక, సిబ్బంది వ్యవహారాల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

## ఓయూ సంచలన నిర్ణయం...

ఉస్మానియా యూనివర్సిటీ సంచలన నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నల్లకుంటలోని హిందీ మహా విద్యాలయం అనుమతులను రద్దు చేసింది. ఈ మేరకు హిందీ మహా విద్యాలయం స్వయం ప్రతిపత్తిని రద్దు చేయాలని యూజీసీకి సిఫార్సు చేసింది. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు కోర్సు పూర్తి చేసేందుకు ఉస్మానియా యూనివర్సిటీ అవకాశం కల్పించింది. విద్యార్థుల మార్కుల జాబితాలో అక్రమాలు జరిగినట్లు ఓయూ విచారణ కమిటీ తేల్చడంతో ఓయూ ఈ నిర్ణయం తీసుకుంది. ఓ ప్రైవేటు కాలేజీలో ఓయూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు కూడా విచారణ కమిటీ నిర్ధరించింది. ఈ క్రమంలో ఓయూ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## గిఫ్ట్‌డీడ్ వైపు మొగ్గు

-మొదటిపేజీ తరువాయి



కారణంతో : కుటుంబంలో ఒకప్పుడు ఇంటి యజమాని పేరున మాత్రమే భూమి అంతా ఉండాలని భావించేవారు. కానీ కాలక్రమేణా ఈ ఆలోచనల్లో మార్పు వచ్చింది. ఒక యజమాని తనకు ఉన్న భూమిని ఎవరైనా కుటుంబ సభ్యుడికి ఇవ్వాలంటే భాగం పంచాలి. కానీ ఈ ప్రక్రియలో పెద్ద కసరత్తే చేయాల్సి ఉంటుంది. కుమారులు, కుమార్తెలు ఉంటే వారందరినీ ఒప్పించాలి. వారిలో ఎవరు అభ్యంతరం చెప్పినా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగే అవకాశం ఉండదు.
కానీ గిఫ్ట్‌డీడ్(బహుమతి) అయితే ఎవరి అభ్యంతరం ఉండదు. యజమాని తాను కోరుకున్న వాళ్లకు ల్యాండ్(భూమి)ను రాసిచ్చే అవకాశం ఉంది. ఈ కారణంగా గిఫ్ట్‌డీడ్ వైపు మొగ్గు చూపుతున్నారు. గిఫ్ట్ డీడ్ మినహా ఇతర లావాదేవీల్లో రిజిస్ట్రేషన్–మ్యుటేషన్‌కు అమ్మేవారితో పాటు, కొనుగోలుదారులతో పాటు నలుగురు సాక్షులు హాజరు కావాల్సి ఉంటుంది. గిఫ్ట్ డీడ్ ప్రక్రియలో భూయజమానితో పాటు బహుమతి పొందే వ్యక్తి, ఇద్దరు సాక్షులు ఉంటే చాలు.
ప్రభుత్వం అందించే రాయితీలు : ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి రైతు బీమా పథకం కింద ఏ ప్రమాదంలో ప్రాణం పోయినా 5 లక్షల రూపాయల పరిహారం వర్తించడం అనేది గ్రామీణ రైతులను గిఫ్ట్‌డీడ్ వైపు ఆలోచించేలా చేస్తోంది. ప్రస్తుతం ధరణి పోర్టల్ ద్వారా జరుగుతున్నటువంటి లావాదేవీల్లో గిఫ్ట్ డీడ్‌కు భూమి మార్కెట్ విలువపై 3 శాతం ఛార్జీ వసూలు చేస్తున్నారు. విక్రయ రిజిస్ట్రేషన్ల తరవాత సర్కారు ఖజానాకు గిఫ్ట్‌ల ద్వారా వచ్చే రాబడి కూడా ఆశాజనకంగా ఉంటోందని రెవెన్యూ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

## తెలంగాణలో ప్రజా తిరుగుబాటు రాబోతోంది

-మొదటిపేజీ తరువాయి



బండి సంజయ్ కుమార్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో కంటే ఎక్కువ సీట్లు బీజేపీ సాధించిందని అన్నారు. కాంగ్రెస్ సీఎంలు అంతా కలిసి ప్రచారం చేసినా ఆ పార్టీని మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదని అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేసిన చోట కూడా కాంగ్రెస్ ఓడిపోయిందని చెప్పారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని మహా ప్రజలు నమ్మలేదని. తెలంగాణ కాంగ్రెస్‌కు ఇదే గతి పడుతుందని బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదని అన్నారు. మహారాష్ట్రలో విజయ దంక మోగించామని ఉద్ఘాటించారు. మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. సిద్ధాంతానికి వ్యతిరేకంగా శివసేన వెళ్లిందని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌కు ఇదే గతి పడుతుందని చెప్పారు.తెలంగాణలో ఇచ్చిన ఒక్క హామీ కూడా ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే అవకాశం ఇంకొకరికి ఇవ్వరని... వాళ్లలో వాళ్లే ప్రభుత్వాన్ని కూల్చుకుంటారని ఎద్దేవా చేశారు. తాము కూల్చాలని అనుకోవడం లేదని చెప్పారు. మహా ఫలితాలతో తెలంగాణ కాంగ్రెస్‌లో లకలుకలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరిగే పరిస్థితి లేదని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

## యువతకు ఉపాధి కల్పించడమే తన ఉద్దేశం

-మొదటిపేజీ తరువాయి

దీనిని బహిరంగ సభలా కాకుండా రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలా ఉండాలన్నారు. నేడు ఆయన వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించారు. వ్యవసాయంలో వస్తున్న ఆధునాతన సాగు పద్ధతులను, మెలకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు అప్పటికప్పుడు వచ్చి వెళ్లేలా కాకుండా వారికి అవగాహన కల్పించేలా మూడ్రోజుల పాటు సదస్సు నిర్వహించాలన్నారు. అందుకే ఈ స్టాల్స్‌ను 28వ తేదీ నుంచి అందుబాటులో ఉంచాలన్నారు.

## మద్యం లారీలకు రక్షణ కల్పించాలి.. స్టాక్ పాయింట్ వద్ద యజమానుల ధర్నా



**తిమ్మాజిపేట, నవంబర్ 23 :** మద్యం లారీలకు రక్షణ కల్పించాలని మద్యం లారీ యజమానులు డిమాండ్ చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటలోని టీజీబీసీఎల్ స్టాక్ పాయింట్ వద్ద వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో లారీల నుంచి మద్యం చోరీకి గురవుతున్నదని వాపోయారు. దీంతో పోయిన మద్యం విలువ మేము చేతి నుంచి చెల్లించాల్సి వస్తుందని, అందుకే స్టాక్ పాయింట్ అధికారులు మద్యం లారీలకు రక్షణ కల్పించాలన్నారు. పలు దఫాలుగా చర్చలు నిర్వహించినా ఫలితం లభించకపోవడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తామని స్టాక్ పాయింట్ అధికారులు తెలిపారు. అధికారుల హామీతో లారీ యజమానులు ధర్నా విరమించారు.

## సంపాదకీయం

# సమ భాగస్వామ్యంతోనే హింస లేని సమాజం


మహిళలు, బాలికలపై జరుగుతున్న హింస నిర్మూలన కోసం నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 మానవ హక్కుల దినోత్సవం వరకు లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా విస్తృత క్యాంపెయిన్ చేయాలని 1981లో యునెస్కో ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. 4 దశాబ్దాలు గడిచినా మహిళలపై హింస బహు రూపాల్లో పెరుగుతూనే ఉంది. ఇంటా బయటా మహిళలు, బాలికలపై జరుగుతున్న హింస వ్యక్తిగత వ్యవహారం కాదు. సమాజం, కుటుంబం, న్యాయ వ్యవస్థ, ప్రభుత్వాలు, పోలీసు వ్యవస్థ మహిళలకు న్యాయం, భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలి. కానీ ఆ విధమైన చర్యలు లేవు. స్త్రీల శరీరాన్ని ఒక ప్రాపర్టీగా చూస్తున్నారు. స్త్రీలు 'నో' అంటే వారి అభిప్రాయానికి విలువ, గౌరవం ఇవ్వకపోగా సామూహిక లైంగిక దాడులకు తెగబడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, స్వామీజీలు, బాబాలు, న్యాయవాదులు, మహి ళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. వారిపై కేసులు నమోదు కావు. ప్రజాగ్రహంతో నమోదయినా రాజకీయ నాయకుల పలుకుబడితో శిక్షల నుండి తప్పించుకుంటారు. మహిళలపై అత్యాచారాలు జరిగినప్పుడు వారి వస్త్రాలు, హావభావాలు, ప్రవర్తన రెచ్చగొట్టే విధంగా ఉండటం వలనే నేరాలు జరుగుతున్నాయని రాజకీయ నాయకులే నిస్సిగ్గుగా వ్యాఖ్యానిస్తున్నారు. నాలుగేళ్ళ చిన్నారుల మీదా అత్యాచారాలు చోటుచేసుకుంటున్నాయి. విధి నిర్వహణలో వున్న కలకత్తా జూనియర్ డాక్టర్ మీదా పాశవిక హత్యాకాండకు పాల్పడ్డారు. దీనికి ఈ పెద్ద మనుషులు ఏం సమాధానం ఇస్తారు? మానవత్వాన్ని మరిచిపోయి మహిళలను సరుకుగా చూపే విష సంస్కృతి కొత్త రూపాల్లో రాజ్యమేలుతున్నది. వ్యాపార ప్రకటనలు, సినిమాలలోనూ వ్యాపార కోణంతో స్త్రీని అసభ్యంగా చిత్రీకరిస్తున్నారు. ఏ వస్తువులు అమ్ముకోవాలన్నా స్త్రీల ఆత్మగౌరవాన్ని, అంగాంగాలను ఎర చూపాల్సిందే! 1986లో అశ్లీల నిరోధక చట్టాన్ని తీసుకొచ్చినా ఆ తర్వాత సోషల్ మీడియా, టీవీలు, ఇంటర్‌నెట్, యూట్యూబ్ వంటి వాటికి వర్తింపచేస్తూ 2000లో ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ (ఐ.టి) చట్టం చేశారు. ఇందులో సెక్షన్ 67 కింద అసభ్య, శృంగార చిత్రాలను (పోర్నోగ్రఫీ) తీవ్రమైన నేరంగా పేర్కొన్నారు. ఒక మహిళ మీద జరిగిన దాడి ఆమె జీవించే హక్కు పైన, గౌరవంపైన దాడి వంటిది. ఇది రాజ్యాంగ ఉల్లంఘన కిందికి వస్తుంది. ప్రభుత్వాలు ఘటన జరిగినప్పుడు కంటితుడుపు చర్యలు తప్ప నేరాలను అరికట్టేందుకు నివారణా చర్యలు లేవు. మాదక ద్రవ్యాలు, మత్తు మందులు, అశ్లీల సినిమాలు, సాహిత్యం, సోషల్ మీడియా, సెల్‌ఫోన్‌లో నీలి చిత్రాల వలన వయస్సుతో నిమిత్తం లేకుండా పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు బలవుతున్నారు. గడప లోపలా హింసే మహిళలపై జరుగుతున్న హత్యల్లో 28 శాతం కుంటుంబ సభ్యులే చేస్తున్నారని నేషనల్ క్రైమ్ బ్యూరో లెక్కలు చెప్తున్నాయి. మహిళలు భర్త, సన్నిహిత కుటుంబ సభ్యుల చేతుల్లోనే హతమవుతున్న ఘటనలు ఎన్నో. 2022లో ఆత్మహత్య చేసుకున్న 45,028 మందిలో సగానికి పైగా గృహిణులే వున్నారు. 2022లో భారత్‌లో ఎన్.సి.ఆర్.బి నివేదిక ప్రకారం బాలికలు, మహిళలపై 4,28,000 కేసులు నమోదయ్యాయి. అందులో 7.9 శాతం అత్యాచార కేసులు, 21.8 శాతం భౌతిక దాడులు, 31.8 శాతం గృహ హింస కేసులు నమోదైనట్లు నివేదిక తెలుపుతున్నది. నమోదు కాని కేసులు లెక్కకు మించి ఉన్నాయి. 2030 నాటికి మహిళలకు, బాలికలకు సాధికారిత, లింగ సమానత్వాన్ని సాధించాలని ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ఐదవదిగా పేర్కొంది. స్త్రీ పురుషుల మధ్య ప్రాకృతిక విభజనను సామాజిక కోణం నుంచి అర్థం చేసుకోవటానికి బదులుగా... సామాజిక అసమానతలకు ప్రకృతిని అన్వయించి ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే ధోరణి సహించరాని విషయం. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కేటాయింపు విషయంలో మన రాజకీయ నాయకులు 1996 నుండి తగవులాడుకుంటూనే ఉన్నారు. ప్రజాస్వామ్య సంస్థలన్నింటిలోనూ స్త్రీలు చురుకుగా పాల్గొనడం సాధికారిత సాధనకు అత్యంత అవసరం. మహిళలు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో నిరాఘాటంగా పాల్గొనేంత వరకు వారి హక్కులు నిరాకరింపబడుతూనే ఉంటాయి. బాలికలకు ఉన్నత చదువులు, ఉద్యోగ, నైపుణ్యాలతో పాటుగా పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలి. స్త్రీ పురుష అక్షరాస్యతల మధ్య 17.2 పాయింట్ల తేడా ఉంది. రాజకీయ సాధికారిత సూచికలో భారతదేశం స్థానిక సంస్థల్లో కొంత మెరుగ్గా ఉన్నా విధాన నిర్ణయాలు చేసే పార్లమెంటులో మహిళా ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. 543 స్థానాలలో సుమారు 800 మంది మహిళలు పోటీ చేయగా 74 మంది మాత్రమే ఎన్నికయ్యారు. 2019 కన్నా 4 సీట్లు తగ్గాయి. మొత్తం 13.6 శాతమే. మహిళా రిజర్వేషన్ బిల్లు 2023లో పార్లమెంట్‌లో ఆమోదం పొందినా కుంటి సాకులు చెప్తూ అమలు చేయలేదు. బిల్లు అమలైతే 181 మంది మహిళలు లబ్ధి పొందేవారు. న్యూఢిల్లీ వరల్డ్ ఎకనామిక్ ఫోరం విడుదల చేసిన గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్టు-2024 ప్రకారం భారతదేశం 146 దేశాల్లో 129వ ర్యాంకులో ఉంది. ఈ తిరోగమనం విద్య, రాజకీయ సాధికారితలో క్షీణత ఫలితమే! నాగరిక సమాజానికైనా పునాది మానవ హక్కులే. మహిళల హక్కులు లేకుండా మానవ హక్కులు లేవు. ఐక్యరాజ్య సమితి 1948 అక్టోబర్ 10 సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన రూపొందించింది. ఆ ప్రకటనలో ప్రజలందరూ వారి జాతి, మతం, లింగ బేధం లేకుండా విద్య, రాజకీయ, ఆర్థిక హక్కులను, మనిషి గౌరవంగా బతకటానికి కావల్సిన హక్కులన్నింటినీ పొందే హక్కును ప్రకటించింది. అయినప్పటికీ జనాభాలో సగభాగంగా వున్న మహిళలు అన్ని విధాలా వెనుకబడే ఉన్నారు. స్త్రీల పట్ల వివక్షను నిర్మూలించేందుకు 1979 డిసెంబర్‌లో ఐక్యరాజ్య సమితి (యు.ఎన్.ఓ) ఆధ్వర్యంలో జరిగిన సదస్సు స్త్రీల హక్కులు మానవ హక్కులని పేర్కొంది. స్త్రీ పురుషుల మధ్య అసమానత దేశాభివృద్ధికి ఆటంకం. స్త్రీలు, బాలికల ప్రాథమిక హక్కులు మానవ హక్కుల్లో అంతర్భాగమని, వాటిని ప్రభుత్వాలు కచ్చితంగా అమలు చేయాలంది. సమాజంలోని అన్ని రంగాలలోనూ, అధికారాల లోనూ, నిర్ణాయాత్మక సంస్థలలోనూ మహిళలు సమ భాగస్వాములైనప్పుడే హింస లేని సమాజంతోపాటు, అభివృద్ధి, శాంతి, సమానత సాధ్యమని యు.ఎన్.ఓ వెల్లడించింది. ఆ దిశగా ప్రభుత్వాలు కచ్చితమైన నిర్ణయాలు చేసి అమలు జరపాలి.

# మరో పోరాటానికి సమాయత్తం



కేంద్రంలో బిజెపికి పూర్తి మెజారిటీ రానందున సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. గతంలో అనుసరించిన కార్పోరేట్ అనుకూల విధానాలనే అమలు చేసేందుకు పూనుకుంటున్నది. 2021 డిసెంబర్ తొమ్మిదిన వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసే సందర్భంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలకు భిన్నంగా కార్పోరేట్ అనుకూల విధానాలనే మరొక రూపంలో అమలుకు పూనుకుంటున్నది. బడ్జెట్ సందర్భంగా డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ (డి.ఎ.ఎమ్) పథకాన్ని ప్రకటించింది. ఆ పథకం ప్రకారం 2026 నాటికి 11 కోట్ల మంది రైతులను కార్పొరేట్ కంపెనీలకు అనుసంధానం చేస్తానని ప్రకటించింది. అందుకుగాను ఇప్పటికే భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐ.సి.ఎ.ఆర్) ద్వారా కంపెనీలకు అగ్రిమెంట్లు రాయిస్తున్నది. గత ఏడాది బడ్జెట్ సమావేశాలలోనే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ నిలిపివేసింది. ఈ ఏడాది ధాన్యం గోదాముల కొనుగోళ్ళు నిలిపివేసింది. గోడౌన్లు ఖాళీ లేవని చెప్తున్నది. వాస్తవానికి ఎఫ్.సి.ఐ, సెంట్రల్ వేర్ హౌసింగ్, వ్యవసాయ మార్కెట్ కమిటీల గోడౌన్లు కార్పోరేట్ కంపెనీలకు అద్దెకు ఇచ్చివేసింది. ఏటా పంటల ఉత్పత్తి ఖర్చులు 12 నుండి 15 శాతం పెరుగుతున్నాయని లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు 2 నుండి 7 శాతం మాత్రమే పెంచింది. ఈ స్థితిలో పంటల కొనుగోళ్ళ నుండి తప్పుకుని రైతాంగాన్ని మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వదలివే స్తున్నది. ఎరువులపై నియంత్రణ తొలగించింది. ఎరువుల ధరలు రైతులకు అందుబాటులో లేకుండా పెరిగిపోతున్నాయి. వ్యవసాయ ఉపకరణాలపై జి.ఎస్.టి భారంగా మారింది. గత ఏడాది సహకార పరపతి సంఘాలను కేంద్రం అధీనంలోకి తీసుకుంటూ చట్టం చేసింది. పరపతి సంఘాలలో పెట్టుబడిదారులు సభ్యులుగా చేరటానికి వారు ఎన్ని షేర్లకు డిపాజిట్ వేస్తే అన్ని షేర్లకు ఓటింగ్ ఇచ్చే విధంగా చట్టం చేసింది. ఈ ఏడాది పరపతి సహకార సంఘాలకు తోడుగా పాల సహకార సంఘాలను, మత్స్య సహకార సంఘాలను దీనిలో చేర్చింది. పేద రైతులు, వృత్తిదారులు సభ్యులుగా ఉన్న సహకార సంఘాలన్నీ పెట్టుబడిదారుల, వడ్డీ వ్యాపారుల హస్తగతం అవుతాయి. వారి స్వలాభాలకే ఉపయోగపడతాయి. ఇప్పటికే పీకల లోతు అప్పులలో కూరుకుపోయి పేద రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యల పాలవుతున్నారు. రైతుల రుణాలు మాఫీ చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అవుతుందని చెప్తున్న ప్రభుత్వం, ఈ కాలంలో కార్పోరేట్లకు రూ.16.50 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసింది. గత నెలలోనే అదానీ కంపెనీకి రూ.12 వేల కోట్ల రుణం మాఫీ చేసింది. అటవీ హక్కుల చట్టానికి సవరణ చేసింది. అటవీ భూములన్నీ కార్పోరేట్ శక్తులకు అప్పజెప్ప చూస్తున్నది. పేదల చేతులలో ఉన్న బంజరు భూములను సముద్ర తీరంలోని ఉప్పు కళ్ళాలను కంపెనీలకు అప్పజెప్ప చూస్తున్నది. 2013 భూసేకరణ చట్టం సక్రమంగా అమలుపరచడం లేదు. పేదరికంలో 127 దేశాలలో మన దేశం 112వ స్థానంలో ఉందని సర్వేలన్నీ చెప్తున్నాయి. ఈ స్థితిలో ఆహార భద్రత చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు పరచవలసి ఉండగా బడ్జెట్లో రూ.60,470 కోట్లు కోత విధించింది. ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తున్నది. ఆరు కోట్ల మంది ఉపాధి హామీ కూలీల జాబ్ కార్డులు తొలగించింది. గ్రామీణ పేదలు ప్రయాణించే పాసింజర్ రైళ్లను రద్దు చేసింది. ఎక్స్‌ప్రెస్ రైళ్ళలో జనరల్ బోగీలను తీసివేసింది. ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తున్న ది. జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేటుపరం చేస్తున్నది. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యలు వేగవంతం చేస్తున్నది. పరిశ్రమలను గనులను, నౌకాశ్రయాలను, రవాణా రంగాలన్నింటిని కారు చౌకగా కార్పొరేట్లకు అప్పగిస్తున్నది. ప్రభుత్వ రంగాలన్నింటిలోనూ అదానీ, అంబానీల ఉద్యోగులను సలహాదారులుగా నియమించింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించడానికి నిర్ణయించింది. కార్మిక వర్గం 3 సంవత్సరాల నుండి ప్రతిఘటించడంతో ఫ్యాక్టరీని ఇబ్బందుల పాలు చేస్తున్నది. ప్రజలు బ్యాంకుల్లో దాచుకుంటున్న డిపాజిట్లు అన్నింటిని కార్పోరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నది. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు పరచడం లేదు. సుప్రీంకోర్టు చెప్పినా స్కీమ్ వర్కర్లను, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్యకర్తలను కార్మికులుగా గుర్తించడం లేదు. ఎంతకాలం పని చేసినా కార్మికులను పర్మినెంట్ చేయడం లేదు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ట్రైనీ గౌరవ వేతనం పేర్లతో కార్మికులను అత్యంత దోపిడీకి గురి చేస్తున్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం.రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్లు ప్రవేశపెట్టింది. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానం పోయింది. 12 గంటల పని విధానం అమలులోకి వచ్చింది. పని భారం పెరగడంతో పాటు ప్రైవేట్ పరిశ్రమలలో పని భద్రత లేకుండా పోయింది. ప్రైయివేట్ పరిశ్రమలలో ప్రమాదాలు, కార్మికుల మరణాలు నిత్యకృత్యం అవుతున్నాయి. ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం కేంద్ర విధానాలను తూచా తప్పకుండా అమలు పరుస్తున్నది. విద్యుత్ స్మార్ట్ మీటర్లు వ్యవసాయ మోటార్లతో పాటు, గృహ వినియోగదారులకు, చిన్న వ్యాపారులకు ఏర్పాటు చేస్తున్నది. ట్రూఅప్ చార్జీల ప్రీపెయిడ్ చార్జీల పేరుతో రూ.17 వేల కోట్లు భారాలు వేసి వసూలుకు పూనుకుంటున్నది. 2023 ఆగస్టు 24న ఢిల్లీలో సమావేశమైన దేశవ్యాప్త కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ, సంయుక్త కిసాన్ మోర్చా కమిటీలో వ్యవసాయ రంగంలో, పారిశ్రామిక రంగంలోనూ సాధించవలసిన డిమాండ్లను రూపొందించాయి. 2023 నవంబర్ 26 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా మహా ధర్నాలు నిర్వహించింది. 13 మాసాలు పోరాడి చట్టాలను రద్దు చేయించిన అనుభవంతో డిమాండ్ల సాధనకు పోరాటానికి సిద్ధమయ్యింది. రాబోయే మూడు మాసాలలో తమ న్యాయమైన డిమాండ్లను ఆమోదించకపోతే సుదీర్ఘమైన పోరాటానికి సిద్ధమవుతుంది. అందుకు సన్నాహంగా నవంబర్ 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు పిలుపునిచ్చింది. నవంబర్ 26 కార్మికులు, కర్షకులే కాకుండా వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, వృత్తిదారులు, మహిళలు, విద్యార్థులు, యువకులు వినియోగదారులందర్నీ కదిలించటం ద్వారా కేంద్రానికి హెచ్చరిక పంపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నిస్వార్థ ప్రజాసేవకుడు పట్టాభి



భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాంధీ కి సన్నిహితునిగా పట్టాభి సీతారామయ్య నిర్వహిం చిన పాత్ర మరవ లేనిది. డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్వాతంత్ర్య సమరయోధునిగా, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షు నిగా, ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాప కునిగా, తెలుగు భాషాభిమానిగా, ప్రత్యేక రాష్ట్ర సాధకునిగా, ఖద్దరు దారిగా, స్వాతంత్ర్య సమరశీలిగా, మహాత్మా గాంధీకి ఆప్తునిగా, రాజకీయ చతురునిగా, గవర్నర్ గా, నిరంతర ప్రజా సేవకునిగా, ముక్కుసూటి మనిషిగా ఆయన బహుముఖ శక్తిగా, వ్యక్తిగా సుపరిచితులు.పశ్చిమ గోదావరి జిల్లా గుండుకొలను గ్రామంలో 1880, నవంబర్ 24 న ఆరువేల నియోగి బ్రాహ్మణుల ఇంటిలో పట్టాభి జన్మించారు. ప్రాథమిక విద్య స్థానికంగా బందరులోనే చదివి ఉన్నత విద్యకై మద్రాసు (నేటి చెన్నై) వెళ్ళి మద్రాసు క్రైస్తవ కళాశాల నుండి బి.ఏ. డిగ్రీ పొందిన పట్టాభి ఎం.బి.సి.ఎం. డిగ్రీ సాధించి డాక్టరు కావాలనే తన ఆశయాన్ని నెరవేర్చు కున్నారు. 1906లో మచిలీపట్నంలో వైద్యవృత్తిని చేపట్టారు. స్వాతంత్ర్య సమర యోధునిగా, కాంగ్రెస్ నాయకుడిగా ఉంటూనే చదువు పూర్తి చేసిన తర్వాత మచిలీ పట్నంలో డాక్టరుగా ప్రాక్టీసు పెట్టారు, కాని తన వృత్తి, ప్రవృత్తి అది కాదని ఎంచి, లాభదాయక మైన సంపాదనను వదులుకొని గాంధీజీచే ప్రభావితులై, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమములో పాల్గొన్నారు. అయితే గాంధీజీ పిలుపు మేరకు 1916 లో ఆ వృత్తిని వదిలి పెట్టడమే కాకుండా, భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించే వరకు ఎటువంటి వృత్తిని చేపట్ట కూడదనే ధ్యేయంతో ముందుకు సాగారు. సామాన్య ప్రజలకు బ్యాంకులు అందుబాటులో లేని రోజుల్లో, అప్పులకోసం అన్నదాతలు ఎదురు తెన్నులు చూస్తున్న రోజుల్లో వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం నేడు దేశంలో ప్రముఖ బ్యాంకుగా చలామణి అవుతున్న ఆంధ్రా బ్యాంక్‌ను 1923లో స్థాపిం చారు. అంతేకాకుండా ఆయన స్థాపించిన ఆంధ్ర ఇన్సూరెన్స్ కంపెని (1925), హిందుస్తాన్ ఐడియల్ ఇన్సూరెన్స్ కంపెని (1935) లు తరువాతి కాలంలో ఇన్సూరెన్స్ కార్పొ రేషన్‌లో విలీనమయ్యాయి. కాంగ్రెస్ పార్టీలో పట్టాభి గాంధీజీకి అతి సన్నిహితంగా ఉండేవారు. 1939లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి అతివాద కాంగ్రెస్ అభ్యర్థి అయిన సుభాష్ చంద్రబోస్ కు వ్యతిరేకంగా, మహాత్మా గాంధీ అభిమతానికి దగ్గరైన వాడిగా, పట్టాభి పోటీలో పాల్గొని ఓటమి పాలైనారు. తమిళ ఆధిపత్యమున్న కొన్ని జిల్లాలను భావి తెలుగు రాష్ట్రములో కలపటానికి మద్దతు నిస్తున్నాడన్న భావన ఆయన ఓటమికి ప్రధాన కారణమయ్యింది. పట్టాభి ఓటమి తన ఓటమిగా గాంధీజీ భావించి బాధపడ్డారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ ప్రారంభములో కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ వర్గంలో పనిచేస్తూ ఉండగా మొత్తం కార్యాచరణ వర్గ సహితంగా పట్టాభిని అరెస్టు చేసి జైలు పాలు చేయగా, మూడేళ్ల పాటు పట్టాభి తన దినచర్యను విస్తారమైన డైరీలో రాసుకున్నారు. దీనిని తదనంతరం ఫెదర్స్ అండ్ స్టోన్స్ (ఈకలు మరియు రాళ్ళు)గా ప్రచురించారు. 1948లో జైపూర్ కాంగ్రెస్ సమా వేశం నాటికి కాంగ్రెస్ అధ్యక్షుని స్థాయికి ఎదిగారు. 1948లో జరిగిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలలో పురుషోత్తమ్ దాస్ టాండన్ పై గెలిచి స్వతంత్ర భారత తొలి కాంగ్రెస్ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించారు. 1952-57 మధ్యకాలంలో మధ్యప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా వ్యవరించారు. రాష్ట్రం బయట పనిచేసిననూ తెలుగు భాషపై మమకారం కోల్పోలేదు. తను స్థాపించిన ఆర్థిక సంస్థలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరగాలని సూచించారు. తెలుగు భాషకు, తెలుగు జాతికి ఎన్నో చిరస్మరణీయ సేవలను ఆయన చిత్తశుద్ధితో అందించారు. నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమైన ఆయనకు రాష్ట్ర మంత్రి వర్గంలో అవకాశం తలుపు తట్టినా, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి పదవి గుమ్మం వరకు వచ్చినా సున్నితంగా తిరస్కరించి ప్రజా సేవలో, రాజకీయాల్లో మునిగిపోయిన మహనీయుడు డాక్టర్ పట్టాభి సీతారామయ్య. ప్రత్యేక తెలుగు రాష్ట్ర ఉద్యమానికి ఆయన చేసిన కృషి మరిచి పోలేనిది. తెలుగు ప్రజలకు ఒక ప్రత్యేక రాష్ట్రం ఉండాలని దాని కొరకు పట్టాభి ఎంతగానో కృషి చేశారు. పట్టాభి చొరవతోనే ఆంధ్ర రాష్ట్రోద్యమానికి అంకురార్పణ 1908లో బందరులో జరిగింది. బందరు సమావేశంలో తెలుగు జిల్లాల ప్రముఖులందరూ సమావేశమై ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం గురించి చర్చించారు. ఆ తరువాతనే 1913లో బాపట్లలో తొలి ఆంధ్ర మహాసభ జరిగింది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఆవశ్యకత గురించి పట్టాభి ఆంగ్లంలో ఒక గ్రంథమే రచించారు. పట్టాభి కృషి వల్లనే 1920లో కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు సూచన ప్రాయంగా ఆమోదించింది. పట్టాభి సీతారామయ్య ఎన్నో ఆర్థిక సంస్థలను స్థాపించారు. ఆంధ్రా బ్యాంకు (1923లో స్థాపన), ఆంధ్రా ఇన్స్యూరెన్స్ కంపెనీ, భారత లక్ష్మీ బ్యాంకు, కృష్ణా కో-ఆపరేటివ్ బ్యాంకు మొదలగు వాటి స్థాపనలో విశేష కృషి సల్పారు. ఆంధ్రా బ్యాంకు ద్వారా వ్యవసాయ దారులకు రుణాలిచ్చి వ్యవసాయా భివృద్ధికి ఎనలేని కృషి చేశారు. చిన్న మొత్తంలో డిపాజిట్లు సేకరించి పొదుపును అధికంగా ప్రోత్సహించారు. ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోసమే కాకుండా తెలుగు జిల్లాలలో తెలుగు వాడకాన్ని పట్టాభి ఎంతగానో ప్రోత్సహించారు. తాను స్థాపించిన సంస్థలన్నింటి లోనూ తప్పనిసరిగా ఉత్తర ప్రత్యుత్తరాలు, లావాదేవీలు తెలుగులోనే జరగాలని నియమ నిబంధనలు పెట్టి ఆచరింప చేశారు. ఆయన వేష, భాషల్లో ఎప్పుడూ తెలుగు తనం ఉట్టిపడుతూ ఉండేది. అఖిల భారత కాంగ్రెస్ అయిననూ, గవర్నర్‌గా మధ్య ప్రదేశ్ వెళ్ళిననూ వేష, భాషల్లో మార్పు రాలేదు. పట్టాభి రచించిన గ్రంథాలలో కాంగ్రెస్ చరిత్ర అన్నింటికంటే ప్రధానమైనది. సుమారు 1600 పుటల కాంగ్రెస్ చరిత్రను కేవలం 2 మాసాలలో పూర్తిచేశారు. స్వాతంత్ర్యం తరువాత 1948లో తొలి జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టి, తరువాత 1952లో రాజ్యసభ సభ్యునిగా ఎన్నికై పార్లమెంటులో ప్రవేశించారు. 1952 నుండి 1957 వరకు మధ్య ప్రదేశ్ గవర్నరుగా పని చేశారు. తెలుగు ప్రజలకు ఎంతగానో తోడ్పాటు అందించిన పట్టాభి 1957, డిసెంబర్ 17న మరణించారు.

# పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి తనిఖీ చేశారు స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎస్సైని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నేరాలను నియంత్రించడంతో పాటు శాంతి భద్రతలపై ప్రజలకు నమ్మకం కలగాలంటే విజిబుల్ పోలీసింగ్‌తోనే సాధ్యపడుతుందన్నారు. విలేజ్ పోలీస్ అధికారులు, పెట్రో కార్, బ్లూ కోల్ట్ సిబ్బంది తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించాలన్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని తెలిపారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. అనంతరం డీఎస్పీ సిసి కెమెరాలు, సిబ్బంది పని తీరును పరిశీలించడంతో పాటు పెండింగ్ ఫైల్స్, చోరీలు, ఐటీ కేసుల స్థితిగతులపై రికార్డులను తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ పద్ధతులను పాటించాలన్నారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సిఐ జక్కుల హనుమంతు , ఎస్ఐ నారాయణ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# సాయిరెడ్డిఆత్మహత్యకు ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధం లేదు

### అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** ల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, కొండారెడ్డిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ ఆత్మహత్యకు ముఖ్యమంత్రి కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదు అని మాజీ సర్పంచ్ ఆత్మహత్య కు గ్రామంలో ఆయన ఇంటిలోకి రోడ్ లేకుండా చేసారని ఆరోపణలు చేయడం పూర్తి అవాస్తవం గ్రామస్తుల కోరిక మేరకు ప్రభుత్వ స్థలంలో పశువుల ఆసుపత్రి నిర్మాణం చేశారు. ఆయన ఇంటికి దారి కూడా వదిలేశారు.అన్నారు. అయిన కూడా వివాదం లేపుతున్నారు వాస్తవాలు చెప్పినా కూడా ఈ రోజు కేటీఆర్ మళ్ళీ అదే విషయాన్ని ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ ఇంటికి దారి లేనట్టు కేటీఆర్ నిరూపిస్తే తాను ఇలాంటి శిక్షకైనా రాజీనామాకు సిద్ధంగా ఉన్నమాజీ సర్పంచ్ ఇంటికి దారి ఉన్నట్టు నిరూపిస్తా కేటీఆర్ సిద్ధమా కేవలం రాజకీయ లబ్ధికోసం కేటీఆర్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా కేటీఆర్ చేస్తున్న కేటీఆర్ కు ప్రజలే బుద్ధి చెపుతారు. ఇప్పటికైనా కేటీఆర్ రాజకీయ లబ్ది కోసం అవాస్తవాలు ప్రచారం చేయడం. గ్రామంలో వివాదాలు లేపడం మానేయ్యాలి. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్,కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అద్యక్షుడు బెక్కెర బాల్ రెడ్డి , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



**అగ్నిధారన్యూస్ (కల్వకుర్తి):** వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సాయి రెడ్డి ఆత్మహత్య చేసుకొని మరణించడం జరిగింది. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మృత దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. అనంతరం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌన్సిలర్ విజయలక్ష్మి భర్త బుచ్చయ్య అనారోగ్యంతో బాధపడుతూ మరణించడంతో ,పట్టణంలోని అతని నివాసానికి చేరుకొని మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బ్రుంగీ ఆనంద్ కుమార్, సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మార్కెట్ డైరెక్టర్, రమాకాంత్ రెడ్డి, సర్పంచ్ భూపతి రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మ దినం సందర్బంగా రక్త దాన శిబిరం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి పట్టణంలోని టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన%శీ% సందర్భంగా, కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరనికి ముఖ్య అతిథిగా పాల్గొనీ కేక్ కటింగ్ చేసి రక్తదాన శిబిరం ప్రారంబించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, బి ఆర్ ఎస్ పార్టీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ,మాజీ ఐపీఎస్ అర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ప్రవీణ్ కుమార్,అభిమానులు బిఆర్ ఎస్ పార్టీకి చెందిన ప్రతి ఒక్కరూ రక్త దానం చేయాలని కోరుతూ,ఏర్పాటు చేసిన వారికి ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం సూర్యలత మిల్ కార్మిక అధ్యక్షులు, కౌన్సిలర్ సూర్యప్రకాష్ రావు, మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, కౌన్సిలర్ భావన్ల మధు, కల్వకుర్తి మండల నాయకులు బన్నె శ్రీధర్ , ముత్యాల రమేశ్, నరేష్, విష్ణు పట్టణ నాయకులూ ఖదీర్, కాదర్,సాయి,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి డొక్క లింగం , కల్వకుర్తి మండలం బి ఆర్ ఎస్ యువజన అధ్యక్షుడు వట్టేపు కిషోర్ , మండల బి ఆర్ ఎస్ కె వి అధ్యక్షుడు దరమోని గణేష్, బీజీనేపల్లి, బాలరాజు, వట్టేపు గణేష్, పెరుమాళ్ కృష్ణ,ము నుగాసెట్టి విష్ణు, స్వేరోస్ నాయకులు శ్రీధర్, గోవింద్, ఊరుకొండ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ,ఫౌండేషన్ సభ్యులు అశ్విన్ కుమార్, చందు, శ్రీకాంత్ , రాము , భాస్కర్, తదితరులు పాల్గొన్నారు

# నాణ్యమైన పోషక ఆహారాన్ని అందించాలి

### తాహశీల్దార్ తిరుపతయ్య.



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్** మహమ్మదాబాద్ మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో శనివారం మండల తాహసిల్దార్ తిరుపతయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన పోషక ఆహారాన్ని అందించాలని చెప్పారు. కిచెన్ స్టోర్ లోని ఆహార పదార్థాలను సామాగ్రిని వండిన ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని పాఠశాల ఎస్ఓ లక్ష్మీబాయికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నరేందర్ రెడ్డి, ఎంఈఓ రాజు నాయక్ పాఠశాల ఎస్ఓ లక్ష్మీబాయి తదితరులు ఉన్నారు.

# దోషులను కఠినంగా శిక్షించాలి



### మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**అగ్నిధారన్యూస్ ( కల్వకుర్తి) :**వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ సాయి రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరం దురదృష్టకరం అని మాజీ ఎం ఎల్ ఎ జైపాల్ యాదవ్ అన్నారు కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో సాయిరెడ్డి శవాన్ని పరిశీలించి అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ,ఆయన స్వయంగా మరణ వాంగ్మూలం రాసినా దానిపై సంపూర్ణ దర్యాప్తు నిర్వహించి ఆయన ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు ఎవరు ఎంత ఇబ్బంది పెట్టినారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుల పేర్లు ఆయన మరణ వాంగ్మూలం లో స్వయంగా తనే రాశారు కావున వెంటనే దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలి అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం , కల్వకుర్తి మాజీ ఎంపీపీ గోవర్ధన్ , సూర్యలత స్పిన్నింగ్ మిల్ అధ్యక్షులు సూర్య ప్రకాష్ , బావ%శీ%ల్ల మధు , ప్రదీప్, వెల్దండ బి ఆర్ ఎస్ పార్టీ నాయకలు గోకమల్ల రాజు కల్వకుర్తి బి ఆర్ ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ డొక్కా లింగం బిఆర్ ఎస్ యువజన అధ్యక్షులు వట్టేపు కిషోర్ ,యువ నాయకులు బాల్ రాజ్, గణేష్, దరామోని గణేష్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

# జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి):** జిల్లా కేంద్రంలో జరిగిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వెంకటరమణ తెలిపారు. కల్వకుర్తి మండలం మార్చాల జిల్లా పరిషత్ ప్రధాన ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వెంకటరమణ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఎన్నిక పట్ల ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతు ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి, నాణ్యమైన విద్యను అందించుటకు సమాజానికి ప్రభుత్వ పాఠశాలపై గౌరవం కలిగేటట్లు కృషి చేస్తానని వెంకటరమణ తెలిపారు.

# అవకాశాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అదనపు కలెక్టర్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సుబ్రహ్మణ్యంతో కలిసి తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ ని సందర్శించి విద్యార్థులతో పాటు సహపంక్తి భోజనం చేశారు. అంతకుముందు కళాశాలలో వంటగదిని, వంట సామాగ్రిని స్టోర్ చేసిన గదులను పరిశీలించారు. వంట సామాగ్రి నాణ్యతగా ఉందా లేదా అని పరిశీలించారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించాలని చెప్పారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. అనంతరం, స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ హవీలా రాణి, మైనారిటీ శాఖ సిబ్బంది లోకేష్ రెడ్డి, ఉపాద్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# రిటైర్డ్ అయిన సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

**అగ్ని ధార న్యూస్. మందమర్రి. నవంబర్ 23. :** రిటైర్ అయిన సింగరేణి కార్మికులకు 18.27 కోట్ల రూపాయల దీపావళి బోనస్ఈనెల 27న కార్మికుల ఖాతాల్లో జమ కానున్న బోనస్సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడి.సింగరేణి భవన్, నవంబర్ 23, 2024సింగరేణి సంస్థలో 2023- 24 ఆర్థిక సంవత్సరంలో మరియు ఏప్రిల్ 1, 2024 నుంచి అక్టోబరు 24, 2024 మధ్యలో పనిచేసి రిటైర్ అయిన కార్మికులకు సంబంధించిన, పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు స్కీమ్( దీపావళి బోనస్) సొమ్మును విడుదల చేస్తున్నామని, ఈనెల 27వ తేదీన, వారి ఖాతాల్లో బోనస్ సొమ్ము జమ అవుతుందని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ శనివారం నాడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రిటైర్ అయిన 2,754 మంది కార్మికులకు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి గరిష్టంగా 93,750 రూ.చొప్పున మొత్తం 18 కోట్ల 27 లక్షల రూపాయలను, విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల 27న,రిటైర్డు కార్మికుల ఖాతాల్లో వై శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.మేరకు కళ్యాణదుర్గం మండలంలోని నారాయణపురం పంచాయతీ నందు టిడిపి సభ్యత్వాలు భారీగా నమోదు అయినాయి. నారాయణపురం గ్రామం నందు దాదాపు 100కు పైగా టిడిపి సభ్యత్వాలు నమోదు చేసినారు. నారా లోకేష్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వం తీసుకున్న వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు అనంద్ రెడ్డి, టిడిపి నాయకులు ఎం ఎల్ ప్రియదర్శిని,మారుతి,రమేష్, సింగమనేని అరుణ, వెంకటేష్, తిమ్మారెడ్డి, నారాయణ, రవి, ఓబులమ్మ మరియు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



### చారి ట్రబల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** మాడుగుల మండలం సుద్ద పల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన గేర యాదయ్య చికిత్స పొందుతూ మరణించడం జరిగింది. ఈ విషయం ఆర్కపెల్లి బి ఆర్ ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్నఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ మృతుని కుటుంబానికి సానుభూతి తెలుపుతూ 3000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో, దార్ల గణేష్ చంటి, శేఖర్, ఎలీషా గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# బడుగు బలహీన వర్గాల సమస్యలను పరిష్కరించాలి




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు కల్వకుర్తి పట్టణంలో, డీఎస్పీ నాయకులు మాట్లాడుతూ, ఈ రాష్ట్రం లోని పేద మధ్యతరగతి వర్గాలైన బిసి, ఎస్సి ,ఎస్టి, ఈ బి సి, ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు విద్య, వైద్యం, ఉపాధి,భూమి,ఇల్లు ఈ 5 పథకాలు అమలు పరిష్కారం కోసం డిమాండు చేస్తూ తహసిల్దారు కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలోధర్మ సమాజ్ పార్టీనాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పు సురేష్ మహారాజ్, మరియు కల్వకుర్తి మండల నాయకులు కరాటే రాజు, కొప్పు కృష్ణ తేజ, వట్టపు శ్రీశైలం అడ్వకేట్, అందుగుల శివాజీ మహారాజ్, నేరేడు ప్రమోద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఇంటి నిర్మాణానికి చేయూత అందజేత

### చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండ పల్లి మండలంలోని పడకల్ గ్రామనికి చెంది శివగళ్ల నరసింహా తండ్రి పేరు వెంకటయ్య నిరుపేద కుటుంబం తో తను నిర్మించుకుంటున్న ఇల్లు అసంపూర్తిగా మిగిలిపోవడంతో స్థానిక టిఆర్ఎస్ పార్టీ నాయకులను సంప్రదించడం జరిగింది. వారు ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ స్థానిక మాజీ జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ను సంప్రదించగా వెంటనే స్పందించి ఇంటి పై కప్పు కోసం తన ట్రస్ట్ ద్వారా సిమెంట్ , సీకులు అందజేయడం జరిగింది. నరసింహ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు చెవిటి విజయ్ కుమార్, శివగల శ్రీకాంత్, శివగళ్ల నరసింహ, పాల్గొన్నారు.

# ప్రయోగాలకు ప్రయోజనం చేకూర్తేనే సార్ధకత

## వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి




**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** 52వ రాష్ట్రీయ జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలోని విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలకు సార్ధకత చేకూరేల, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు సహకరించాలని అప్పుడే వాటికి సార్ధకత లభిస్తుందని శనివారము వైజ్ఞానిక ముగింపు సమావేశంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.ఈనెల 21, 22, 23 తేదీలలో వనపర్తి పట్టణంలోని సూర్యచంద్ర ప్యాలెస్ స్కూల్లో నిర్వహించిన 52వ రాష్ట్రీయ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ,వనపర్తి నియోజకవర్గం విద్యాభివృద్ధి కోసం, వైద్యభివృద్ధి కోసం, వ్యవసాయ అభివృద్ధి కోసం ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి 550 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు విజ్ఞాపనలు సమర్పించి ఉన్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారుఇందులో కేవలం 160 కోట్లు వనపర్తి లో ముఖ్యమంత్రి చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కేటాయించామని ఎమ్మెల్యే పేర్కొన్నారుప్రస్తుతం విద్యాభివృద్ధి కోసం వనపర్తి నియోజకవర్గానికి ఎడ్యుకేషనల్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ హబ్ మంజూర అయిందని దీంతో వనపర్తి నియోజకవర్గంలోని విద్యార్థులకు ఉన్నత విద్యను అందించబోతున్నామని ఎమ్మెల్యే చెప్పారుఅలాగే 25 ఎకరాలలో స్పోర్ట్స్ స్కూల్ నిర్మించేందుకు సైతం అనుమతులు,మంజూరయ్యాయని తెలంగాణ రాష్ట్ర మొత్తంలో కేవలం రెండు స్పోర్ట్స్ స్కూల్ మంజూరు కాగా అందులో వనపర్తి ఒకటి అవ్వడం గమనార్కమణి ఎమ్మెల్యే పేర్కొన్నారుతెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రభుత్వం అందించే అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత మార్గాలను అధిరోహించాలని ఎమ్మెల్యే సూచించారు.వి ద్యార్థులు అనుకుంటే గ్రామ,మండలా, నియోజకవర్గ జిల్లా దేశ భవిష్యత్తును సైతం మార్చగలరని ఎమ్మెల్యే పేర్కొన్నారు,ఈ సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రధాన చేశారు,కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వనపర్తి పట్టణ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా దిశా కమిటీ సభ్యులు శంకర్ నాయక్, జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, మండలాల విద్యాధికారులు వివిధ పాఠశాలలప్రధానోపాధ్యాయులు,వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భారీ మెజార్టీతో ప్రియాంక గాంధీ

## ప్రియాంక గాంధీ గెలుపుతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్తేజం.

### సితారి లక్ష్మణ్ బాబు.



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని:** కేరళ లోని వయనాడ్ పార్లమెంట్ ఉప ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తొలి సారి ఎన్నికల్లో పోటీ చేసి 4,03,966 ఓట్ల భారీ మెజారిటీ తో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కలుగుతుందని,అన్నివర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న రాహుల్ గాంధీకి అండగా మద్దతుగా దేశ వ్యాప్తంగా ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఇపుడు పార్ల మెంటు సభ్యురాలుగా ప్రియాంక గాంధీ నిరంతరం కృషి చేస్తారని,వచ్చే పార్ల మెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతృత్వం లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుంది అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి సుతారి లక్ష్మన్ బాబు అన్నారు. ఈ సందర్భంగా పార్ల మెంటు సభ్యులుగా అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన అఖిల భారత కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీకి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి సుతారి లక్ష్మన్ బాబు జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్య దర్శి మంతెన వెంకటేష్ నాయకులు నమిండ్ల ఎల్లేష్ కొలిపాక బాపు కుమార్ తదితరులు ఒక పత్రిక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

# రాజ్యాంగ ఆమోద దినోత్సవ సభలకు ఆహ్వానం




**అగ్నిధారన్యూస్ గోదావరిఖని:**రాజ్యాంగ ఆమోద దినోత్సవ సభలకు రామగుండం ఎమ్మెల్యేను,మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆహ్వానించిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘంభారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం దేశ ప్రజలకు అంకితం చేసి 75 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రామగుండం నియోజకవర్గంలో డిసెంబర్ 26 నుండి, బాబాసాహెబ్ అంబేద్కర్ పరమపదించిన, డిసెంబర్ 6 వరకు 10 రోజులపాటు, వివిధ కార్యక్రమాలను చేపడుతుంది, ఇందులో భాగంగా శనివారం నాడు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో రామగుండం శాసనసభ్యులుమక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమాలకు ఆహ్వానించారు, అదేవిధంగా గోదావరిఖని ఏసిపి మడత రమేష్,ని, గోదావరిఖని వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డిని, 2టౌన్ సిఐప్రసాదరావుని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల ఏడుకొండలుని, ఆహ్వానించారు, భారతదేశానికి దిశా నిర్దేశం చూపించిన భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ దిక్సూచి అయిందని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు వెల్లడించారు, మహోన్నతమైన భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజైనా నవంబర్ 26న భారత రాజ్యాంగ ఆమోదం,, ఆత్మగౌరవ కార్నర్ సభలను నిర్వహిస్తున్నామని ఈ కార్నర్ మీటింగ్ లకు రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్,రాష్ట్ర ఉపాధ్యక్షుల కాంపెల్లి సతీష్,, జిల్లా కో కన్వీనర్ దుబాసి, బొందయ్య, రామగుం న్సిపల్ కార్పొరేషన్ కో కన్వీనర్ పంజా అశోక్,జిల్లా కమిటీ సభ్యులు ఎండి నవాబ్,తదితరులు పాల్గొన్నారు.

# బట్టర్ పై లైట్లు బాగు చేయండి



## వనపర్తి మున్సిపల్ కమిషనర్ కు వినతి

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు రాజనగరము అమ్మ చెరువు కట్టపై నిర్మించిన రహదారికి సంబంధించిన వీధిలైట్లు గత 20 రోజులుగా వెలగటం లేదుఅని, సాయంత్రం ఉదయం అటు వెళ్లే బాటసారులకు,రైతులకు,వాకర్స్ చీకటిలో భయంతో నడుస్తున్నారు అని దేశెట్టి అంజయ్య,కాటముని బాలస్వామి, మద్దెల కరుణాకర్, డీజే మల్లేష్, వడ్డేవాడ యువకులు, మరియు రాజనగరం బిఆర్ఎస్ నాయకులు పలువురు వనపర్తి మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

# స్వయంభుగా వెలిసిన హనుమాన్ విగ్రహం



## సందర్శించిన ఎమ్మెల్యే మక్కా సింగ్ రాజ్ ఠాకూర్ దంపతులు.

**అగ్ని ధార న్యూస్ గోదావరిఖని:** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం రామగుండంలోని బి.పవర్ హౌస్ క్రాస్ రోడ్ గుట్టపై వెలసిన ఆంజనేయ స్వామి విగ్రహాన్ని స్థానిక నాయకులతో కలిసి సందర్శించి ఆంజనేయ స్వామి విగ్రహానికి పూల మాల వేసి ప్రత్యేక పూజా నిర్వహించిన రామగుండం ఎమ్మెల్యే దంపతులు,ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన రాముని గుండాల్లో తన హయాంలో హనుమాన్ విగ్రహం దర్శనం ఇవ్వడం పూర్వజన్మ సుకుతంగా భావిస్తున్నానని , ఆలయ నిర్మాణం తో పాటు పారిశ్రామిక ప్రాంతంలో 108 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు ఆయన తెలిపారు. పునర్వాసు నక్షత్రంలో వెలసిన హనుమాన్ విగ్రహంతో రామగుండానికి మహాదశ రానుందని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. రాముని గుండాలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక నిధులతో కేటాయించి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు దేవుని కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని అభివృద్ధిలో రామగుండం నియోజకవర్గం రాష్ట్రస్థాయిలో రోల్ మోడల్ గా తయారు చేస్తామన్నారు. కోటి రూపాయల సొంత ఖర్చుతో అటు ప్రముఖుల నుండి మరో కోటి రూపాయలకు విరాళాలతో విగ్రహ ప్రతిష్టపడు గుడి నిర్మాణం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్పొరేటర్లు వివిధ విభాగాలు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# హమాలీలకు కూలీ రేట్లు పెంచకుంటె ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తాం.



## హమాలీల ఆందోళన కు మద్దతు తెలిపి ప్లే కార్డులతో నిరసన వ్యక్తం చేసిన డి.హెచ్.పి.ఎస్ జిల్లా కన్వీనర్ మద్దెల దినేష్.

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని :**గోదావరిఖని కూరగాయల అగ్నిధార న్యూస్ గోదావరిఖని మార్కెట్ లో హమాలీ కార్మికుల కు కూలీ రేట్లు పెంచాలని అడిగితే పెంచకుండా హోల్ సేల్ వ్యాపారులు హమాలీ కార్మికులను దొంగలు గా చిత్రీకరిస్తూ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయడం, వారిని బూతులు తిట్టడం ఏం సంస్కృతి అని, హమాలీ కార్మికుల పై చేసిన ఫిర్యాదు వెనక్కి తీసుకొని వారికి కూలీ రేట్లు పెంచాలని సిపిఐ అనుబంధ సంస్థ ఐన దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో హమాలీ వర్కర్స్ చేస్తున్న ఆందోళనకు ఆయన మద్దతు తెలుపుతూ హోల్ సేల్ వ్యాపారుల కార్మిక వ్యతిరేక విధానాలపై ప్లే కార్డులతో నిరసన తెలిపారు. అనంతరం దళిత హక్కుల పోరాట సమితి నగర కార్యదర్శి ఎర్రల రాజయ్య, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మరియు ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్ తో కలిసి ఆయన మాట్లాడుతూ గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీ కార్మికులు 2019 జూన్ నెలలో కూలీ రేట్లు పెంచారని, దాని అగ్రిమెంట్ పూర్తయిందని, కూలీ రేట్లు పెంచాలని కోరుతూ హోల్ సేల్ వ్యాపారుల కు, లేబర్ అధికారులకు, పోలీస్ అధికారులకు గత కొన్ని నెలల క్రితం వినతి పత్రాలు ఇచ్చినప్పటికీని హోల్ సేల్ వ్యాపారులు హమాలీ వర్కర్స్ తో చర్చలు జరిపి కూలీ రేట్లు పెంచాల్సి ఉండగా, కూలీ రేట్లు పెంచకుండా హమాలీ లను దొంగలు గా చిత్రీకరిస్తూ పోలీసు స్టేషన్ లో హోల్ సేల్ వ్యాపారులు ఫిర్యాదు చేయడం ఏం సంస్కృతి అని ఆయన మండిపడ్డారు. గత కొన్ని రోజులుగా కూలీ రేట్లు పెంచాలని శాంతి యుతంగా ఆందోళన కార్యక్రమాలు చేపడితె వారిని పట్టించుకోకుండా, నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. హమాలీ వర్కర్స్ రెక్కాడితే డొక్కడితె, చాలిచాలని కూలి రేట్లు వల్ల తమ కుటుంబాలను పోషించుకోవడం అనేక అవస్తలు పడుతున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా హోల్ సేల్ వ్యాపారులు స్పందించి హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులతో చర్చలు జరిపి కూలీ రేట్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు, లేనిచో ఏఐటియుసి, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, సతీష్, జాని మియా తదితరులు పాల్గొన్నారు.

# బి.ఆర్.ఎస్ మండల ప్రధాన కార్యదర్శికి పరామర్శ

## మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి




**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా** :వనపర్తి జిల్లా ఘనపూర్ మండల బి.ఆర్.ఎస్ ప్రధాన కార్యదర్శి పురేందర్ రెడ్డి ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ వల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధితో బాధపడుతూ మహబూబ్ నగర్లోని నవోదయ హాస్పిటల్ నందు చికిత్స తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వెళ్లి పరామర్శించి, త్వరగా కోలుకుంటారని ధైర్యాన్ని ఇచ్చారు, వైద్యుల దగ్గర ఇచ్చిన ట్రీట్మెంట్ గురించి అడిగి తెలుసుకుని వైద్యులను మెరుగైన చికిత్స అందించాలని అయన కోరారు.

# జాతీయ కరాటే పోటీల్లో మంథని విద్యార్థుల ప్రతిభ

## - విద్యార్థులకు సినీ హీరో సుమన్ అభినందనలు




**అగ్నిధార న్యూస్ మంథని** :కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో సినీ నటుడు కృష్ణంరాజు స్మారకార్థం నిర్వహించిన జాతీయ కరాటే పోటీల్లో కరాటే శిక్షకులు కావేటి సవ ్మమయ్య కాయ్ రిఫరీ కమిషన్ ఆధ్వర్యంలో జపాన్ షీటర్ యు కరాటే అకాడమీ విద్యార్థులు సబ్ జూనియర్స్ కథ , కుమితి విభాగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచి బంగారు వెండి కాంస్య పథకాలు సాధించారు.బంగారు పథకాలు సాధించిన వారిలో తులసి సాయి సహస్ర, వి.అ తిధి,అట్టెం రాఘవ,వెండి పతకం సాధించిన వారిలో జడగాల మనస్విని , కాంస్య పథకాలు సాధించిన వారు సుంకరి లక్ష్మీ ప్రియ , ఐలి సౌమ్యత్య , గంధం లక్ష్మీ ప్రసన్న , అట్టెం రక్షిత్ రానా , బండారి మణికంఠ , బెజ్జంకి అక్షయ్ కీర్తన్ పోగుల శివసాకేత్ , మారేడు కొండ రిషి , సుంకరి భరద్వాజ్ లు పథకాలు సాధించారు.పథకాలు సాధించిన వారిని సినీ హీరో సుమన్ తల్వార్ జపాన్ సితోరియో కరాటే జాతీయ ఉపాధ్యక్షులు పి పాపయ్య , కార్య నిర్వహ ాణ అధ్యక్షులు గుంటుపల్లి సమ్మయ్య , కాయ్ రాష్ట్ర అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి బి నరేందర్ , కోశాధికారి సాయికుమార్ , గౌరు రాజిరెడ్డి , ప్రసన్న సంపత్ఇన్స్ట్రక్టర్స్ కావేటి శివ గణేష్ , నాగెల్లి రాకేష్ , జడగాల శివాని , మెట్టు హాసిని లు అభినందించారు.

# మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**అగ్నిదారన్యూస్ (ఎండపల్లి ):** లినల్గొండ జిల్లా కేంద్రంలోని స్థానిక ఎన్జి కలశాల మైదానంలో శనివారం రోజున నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ తో కలిసి పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ .ఈ సందర్బంగా విప్ మాట్లాడుతూ మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్రములోని మాదిగలు అందరూ ఐక్యంగా ఉండాలని మనస్పూర్తిగా కోరుతూ మాదిగలు ఏబిసిడి వర్గాల వారిగా విబజనను సాధించేందుకు కృషిచేసిన మాదిగలు అందరికి కృతజ్ఞతలు వర్గీకరణకు సానుకూలాంగ స్పందించిన రాష్ట్ర సిఎమ్ రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వివాహానికి పుస్తెమట్టెలు బహుకరణ



**అగ్నిదారన్యూస్ (ఎండపల్లి):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ళ రాధా వివాహ సందర్భంగా నిరుపేద కుటుంబం కావడంతో వారి పరిస్థితి తెలుసుకొని వెనంక శ్రీనివాస్ పుస్తెమట్టెలు కొరకు 5016 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తోడేటి రాజు, సామల సంతోష్ కుమార్,ముద్దం శేఖర్, జుంజిపల్లి చంద్రమౌళి, వెంకటస్వామి పాల్గొనడం జరిగింది.

# బిజెపి ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ

**అగ్నిధారాన్యూస్ గోదావరిఖని :** భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పార్లమెంటు కన్వీనర్ గుండబోయిన లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలో మరొకసారి 226 సీట్లతో అత్యధిక మెజార్టీతో ఎన్డీఏ మిత్రపక్షాల ఆధ్వర్యంలో అధికారంలోకి వచ్చిన శుభ సందర్భంగా స్థానిక గోదావరిఖనిలోని మెయిన్ చౌరస్తాలో రామగుండం నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ సీనియర్ కార్యకర్తలు అందరి సమక్షంలో పెద్ద ఎత్తున బాణ సంచాలు కాలుస్తూ స్వీట్స్ పంపిణీ చేస్తూ విజయోత్స సంబరాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య, బిజెపి సీనియర్ నాయకులు మహావాది రామన్న, సులువ లక్ష్మీ నరసయ్య పాల్గొని మాట్లాడుతూ... ప్రపంచ దేశాలలో అగ్రనాయకునిగా వెలుగొందుతూ భారతదేశాన్ని అఖండ భారత వైపు నడిపిస్తున్నటువంటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో అమిత్ షా చాకచక్రంతో 14అత్యధిక స్థానాలను గెలుపొందడం జరిగింది, ఈ సందర్భంగా మహారాష్ట్ర ఓటర్ మహాశయులందరికీ పాదాభివందనము తెలియజేస్తూ వారి విజయానికి సూచికగా ప్రజలందరికీ స్వీట్స్ పంచిపెట్టడంజరిగింది. ఈ దేశంలో ఏ విధమైనటువంటి అవినీతి లేకుండా మొన్న జరిగిన మధ్యప్రదేశ్ ఎలక్షన్లు కావచ్చు రాజస్థాన్లో కావచ్చు హిమాచల్ ప్రదేశ్ ఏ రాష్ట్రంలో చూసిన నరేంద్ర మోడీ కి ఓటు వేస్తాం భారతీయ జనతా పార్టీకి ఓటు వేస్తామని మరొకసారి నిరూపించిన మహారాష్ట్ర ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ వారి ఆలోచన కనుగుణంగానే రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఈ తెలంగాణ రాష్ట్రంలో కూడా బిజెపి రాబోతుందని అన్నారు కాంగ్రెస్ నేతృత్వంలోని రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిరంకుశ పరిపాలన జరుగుతుందని పేదల నడ్డి విరుస్తూ పేదల ఇండ్లను కూల్చూ రాక్షస పరిపాలన సాగిస్తున్నారని, ఆ రాక్షస పరిపాలనకు చరమగీతం పాడి ఈ తెలంగాణ రాష్ట్రంలో కూడా తెలంగాణ ఓటర్ మహాశయులందరూ ఏ ఎన్నికలు వచ్చినా

తెలంగాణ ప్రజలందరూ బిజెపి పార్టీకి భ్రమరతం పట్టి బిజెపిని అధికారంలోకి తీసుకు వచ్చినట్లయితే ఈ దేశంలో ఏ విధంగానైతే పేదవారికి సుపరిపాలన అందిస్తున్నారు అదేవిధంగా ఈ రాష్ట్రంలో కూడా మరింత సుపరిపాలన అందించడం జరుగుతుందని, తద్వారా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే అవకాశం ఉంది కావున రాబోయే ఏ ఎలక్షన్లో అయినా తెలంగాణ ప్రజలందరూ భారతీయ జనతా పార్టీ ఈ పట్టణం కట్టాలని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగానే రామగుండం నియోజకవర్గంలో కూడా ప్రతి సీనియర్ నాయకుడు కార్యకర్తలందరూ కంకర బద్ధులై కార్యవర్గలై భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడానికి పనిచేయాలని దానికి



మేమందరము కార్యకర్తలకు అండగా ఉంటామని వారికి తెలియజేయడంజరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మావాది రామన్న, సులువ లక్ష్మీనరసయ్య, సోమారపు అరుణ్ కుమార్, జనగామ సాగర్, సీతకారి చంద్రశేఖర్, సప్పు, నాగరాజు, బూడిద రమేష్ ,బీమా సుధీర్, జనగామ శివరామకృష్ణ, శివకుమార్, సునీల్, మహేందర్ ,శంకర్, కుమారస్వామి, పాలకుర్తి మల్లేష్ ,రాజేందర్ అధిక సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి.

## సెక్యూరిటీ జిఎం:సిహెచ్.లక్ష్మీనారాయణ

**అగ్నిధార(రామగిరి మండలం) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రామగుండం ఆర్జీ త్రీ పరిధిలో సెక్యూరిటీ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని కార్పొరేట్ సెక్యూరిటీ విభాగం జనరల్ మేనేజర్ సిహెచ్.లక్ష్మీనారాయణ అన్నారు.రామగుండం ఆర్జీ త్రీ మరియు అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలో వారు పర్యటించారు.ముందుగా రామగుండం ఆర్జీ త్రీ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ గుంజపడుగు రఘుపతిని కలిసి ఏరియాలో సెక్యూరిటీ పరంగా చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సెక్యూరిటీ జనరల్ మేనేజర్ గా బాధ్యతలను స్వీకరించిన తర్వాత మొదటి సారిగా ఏరియాలో పర్యటించిన సందర్భంగా ఇంచార్జ్ జి.యం.రఘుపతి ఇతర అధికారులతో కలిసి వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం వారు అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్,ఓసిపి వన్ మరియు టూ ఉపరితల గనులలో ఉన్న చెక్





పోస్టులు,స్టోర్స్,స్క్రాప్ యార్డ్,వ్యూ పాయింట్లను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ యొక్క ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ విభాగం సిబ్బంది పాత్ర కీలకమని,గనులు, విభాగాలలో సింగరేణికి సంబంధించిన సామగ్రి దొంగతనం జరగకుండా చూడాలని అన్నారు. సెక్యూరిటీ సిబ్బంది బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తూ, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వారి పర్యటనను పురస్కరించుకొని ఏరియా సెక్యూరిటీ, పర్సనల్ విభాగం, ఓ.సి టూ గని అధికారులు వారిని సన్మానించారు.ఈ పర్యటనలో భాగంగా వారితోపాటు అడ్రియాల ప్రాజెక్ట్ అధికారి కొలిపాక నాగేశ్వరరావు, ఓ.సి.టూ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్.వెంకటరమణ, ఏరియా సెక్యూరిటీ అధికారి అబ్దుల్ షబ్బీరుద్దీన్,పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి,అధికారులు కె.చంద్రశేఖర్,గుర్రం శ్రీహరి,పి.రాజేశం,మథిన్ హుస్సేన్,జూనియర్ ఇన్స్ పెక్టర్ టి.లింగయ్య, ఇతర సెక్యూరిటి సిబ్బంది పాల్గొన్నారు.

# వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి.

## రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు.



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** ఫైబర్ ఎయిర్టెల్ నెట్ ద్వారా వినియోగదారులకు సేవలు అందించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం రాత్రి పెద్దపల్లి పట్టణంలో ఎయిర్టెల్ ఎక్స్ ట్రీమ్ ఫైబర్ నెట్వర్క్ ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు గ్రామ గ్రామాన ఫైబర్ నెట్వర్క్ సేవలందించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఇంటిలో నెట్ ద్వారా వివిధ కార్యక్రమాలు మరియు ఆన్లైన్ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని స్పష్టం చేశారు. వినియోదారులకు ఎక్కువ సేవలు అందించి తక్కువ ధరకు కనెక్షన్లు ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఫైబర్ నెట్ నిర్వాహకులు పిల్లి శేఖర్ మాట్లాడుతూ వినియోగదారులకు తక్కువ ధరలో అనగా 2500 రూటర్ తోపాటు కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. హై స్పీడ్ లో ఈ నెట్వర్క్ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అట్లూరి లక్ష్మణ్ కుమార్, తోపాటు ఫణిందర్, వెంకటేష్ ,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా కొనసాగుతున్న డాటా ఎంట్రీ.



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్ :** కమాన్ పూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ జోరుగా కొనసాగుతోంది. మండలంలో గల గుండారం ,జూలపల్లి, కమాన్ పూర్ ,పెంచికలపేట్ గొల్లపల్లి నాగారం ,రొంపికుంట ,సిద్ది పల్లె ,పేరా పల్లి, గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరుగుతూ వివరాలు సేకరించారు. ప్రస్తుతం వాటిని కంప్యూటర్లలో ఆపరేటర్లు డాటా ఎంట్రీ చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాగా శనివారం తహసిల్దార్ వాసంతి మరియు ఇన్చార్జి ఎంపీడీవో కాటం భాస్కర్ ఎంట్రీని పరిశీలించారు. మొత్తం 8306 దరఖాస్తుల రాగా శుక్రవారం నుండే దరఖాస్తుల ఎంట్రీ ప్రారంభమైంది. త్వరితగతిన ఎంట్రీ పూర్తి చేయాలని పై అధికారులు సూచించారు. శనివారం సాయంత్రం వరకు కమాన్ పూర్ మండలంలో 239 డాటా ఏంటి అయినట్లు సమాచారం.

# రాయికోడ్ కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. రాయికోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిఖిల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే దోమల నివారణలో భాగంగా ఈ రెండు వసతిగృహాల్లోని ప్రతి గదిని, మరుగుదొడ్లను మలండియన్ స్ప్రే చేయించారు. అదేవిధంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తాగేందుకు కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని ఇవ్వాలని వైద్యురాలు కస్తూర్బా గాంధీ విద్యార్థులకు సూచించారు కార్యక్రమంలో డాక్టర్ నిఖిల ఎస్ఓ రాధిక సూపర్వైజర్లు ఉపాధ్యాయులు విద్యార్థులు ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# రైతు ముంగిట్లో పశు వైద్య సేవలు - పశు వైద్యులు



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా ఝరసంగం మండల పరిధిలోని బార్థిపూర్ గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ , పశు సంవర్ధక శాఖ , డి డి.స్ . కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యం లో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో ఝరసంగం పశు వైద్య అధికారి డాక్టర్.హర్ష వర్ధన్ రెడ్డి మాట్లాడుతు పశువులు రోగాల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా టీకాలు చేసుకోవాలని పాడి రైతులు గోపాల మిత్రా సేవలు వాడుకొని కృత్రిమ గర్భధారణ చేస్కోవాలి పాడి పరిశ్రమ అభివృద్ధికి అన్ని విధాల సేవలు అందిస్తాం అని అన్నారు కృషి విజ్ఞాన కేంద్రం పశు సంవర్తక శాస్తవేత్త డాక్టర్ కైలాష్ మాట్లాడుతూ పాల ఉత్పత్తి పెంచుకోవాలని మీ పాడి పశువులు అభివృద్ధి చెందాలి అందుకోసం పోషకాలు గల మేత దానా , మినరల్ మిక్చర్ పశువులకు అందించాలి అని అన్నారు ఈ శిబిరం లో గర్భకోశ చికిత్సలు సాధారణ చికిత్సలు కృత్రిమ గర్భధారణ, దూడలకు నట్టాల నివారణ చేసారు పాడి రైతులకు మినరల్ మిక్సర్ పంపిణీ చేసినారు ఈ కార్యక్రమంలో సిబ్బంది గోపాలమిత్ర సూపర్వైజర్ అర్జునయ్య మరియు ఓఎస్ శంకర్ గోపాలమిత్ర లు అశోక్ శ్రీకాంత్ మరియు పాడి రైతులు , గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# టిజిపిఎస్సీలో ఉద్యోగం సాధించిన: గండీడ మండలవాసి



**అగ్నిధార న్యూస్మహమ్మదాబాద్/ గండీడ్:** ఇటీవల విడుదలైన (టి జి పి ఎస్ సి )జూనియర్ (లెక్చరర్) గెజిటెడ్ ( అండర్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్) మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని వెన్న చెడు గ్రామానికి చెందిన జి.రాజశేఖర్ జూని యర్ లెక్చరర్ లో మ్యాథమెటిక్స్ విభాగంలో ఎంపికయ్యారు. ఇంటర్మీడియట్ వ్యవస్థ బలోపేతానికి మ్యాథమెటిక్స్ విభాగంలో తన వంతు పాత్ర బలంగా నిర్వహిస్తానని రాజశేఖర్ తెలిపారు.దీంతో మండల నాయకులు,కుటుంబ సభ్యులు,మిత్రులు అభినందనలు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు.

# సిఎంను కలిసిన నేతకాని సంఘం నాయకులు

## ఎమ్మెల్యే వివేక్ నాయకత్వంలో సిఎంకు వినతిపత్రం అందజేత

**అగ్నిధారన్యూస్,( హైదరాబాద్):** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నేత కాని మహార్ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామి ఇచ్చారు. చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి నేతృత్వంలో నేత కాని మహార్ సేవా సంఘం నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం కలిశారు. ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, నాగరాజు , మేడిపల్లి సత్యం కూడా ఉన్నారు. నేత కాని మహార్ సేవా సంఘం నాయకులు దుర్గం నరేష్, దుర్గం స్వామి,దుర్గం గోపాల్, సోదారి తిరుపతి, దుర్గం సిద్దార్థ్ రామ్ , తెలంగాణ నేత కాని మహార్ ఇంటలెక్చువల్ సొసైటీ రాష్ట్ర కన్వీనర్ , సీనియర్ జర్నలిస్టు మసాదే లక్ష్మి నారాయణ ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. నేత కాని కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్ లో నేతకాని మహార్ ఆత్మ గౌరవ భవనానికి స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. అనంతరం సచివాలయంలోని మీడియా సమావేశంలో దుర్గం నరేష్ మాట్లాడుతూ నేతకాని మహార్ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెల్లిన ఎమ్మెల్యే వివేక్ కు క్రుతజ్ఞతలు తెలిపారు. నేత కాని మహార్ సామాజిక వర్గానికి ఉన్న సమస్యలు తనకు తెలునని, ఎమ్మెల్యే వివేక్, వినోద్ ఎప్పుడు కలిసినా నేతకాని మహార్ సంక్షేమం గురించి మాట్లాడుతారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని నరేష్ తెలిపారు. వివేక్, వినోద్ ల నేత్రుత్వంలో నేతకాని మహార్ సామాజిక వర్గం సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకం ఉందని నరేష్ చెప్పారు.

# బాధిత కుటుంబానికి రామగిరి సేవ సమితి సభ్యుల సహకారం.



**అగ్నిధార(రామగిరి మండలం) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని లొంక కేసారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కారు పాకల స్వరూప కుటుంబానికి రామగిరి సేవాసమితి సభ్యుల సహకారంతో వారి కుటుంబ సభ్యులు కారుపాకల కిరణ్ రాయమల్లమ్మలకు బెల్లం శ్రీనివాస్ -జ్యోతి , శివ రైస్ మిల్ శేఖర్ రామగిరి సేవా సమితి సభ్యుల సహకారంతో 50 కేజీల బియ్యం రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామగిరి సేవా సమితి సభ్యులు గంట వెంకటరమణారెడ్డి, వేము కనకయ్య, కోయ్యడ పరుశరామ్, కొప్పుల సునీల్, కుడిది వేణు, తోట శంకర్, మామిడి హరీష్, రొద్ద వైకుంఠం, పాలితం సత్యనారాయణ, కాట వినయ్, బూరుగు రాజ గోపాల్ గౌడ్, డాక్టర్ జగన్, కాటన్ స్వాతి - సాగర్, రంగు శంకరయ్య, మెట్టు ప్రభాకర్, ఎండి సుభాన్, వీరగోని శ్యామల బొంకూరి నర్సమ్మ, ఎండి జావేద్ తదితరులు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ జీ.ఎం కు సన్మానం



**అగ్నిధార(రామగిరి మండలం):** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రామగుండం అర్జీ త్రీ కి విచ్చేసి నటువంటి నూతనంగా జి.ఎం సెక్యూరిటీ గా ఎన్నికైన చందా లక్ష్మీనారాయణకి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ డి.టి రావు ,ఎస్ అండ్ పిసి ఫిట్ సెకరట్రి సిహెచ్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో అర్జీ త్రీ సెక్యూరిటీ అధికారి షబిరుద్దీన్ అధ్యక్షతన ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా తీవ్రంగా ఉన్న సెక్యూరిటీ పలు సమస్యలపై మెమోరాండం ఇవ్వడం జరిగింది.ఇందులో జిమ్ ఆఫీస్ అధికారులు, సీఎస్పీ ఫిట్ సెకరట్రి గంధం శ్రీనివాస్,గౌరవాధ్యక్షుడు నూనె కొమ్మురయ్య, సెక్యూరిటీ ఇన్చార్జి గుత్తికొండ రాజేందర్, వంగ తిరుపతిరెడ్డి,దగ్గుల శ్రీనివాస్ మరియు కారుపాకల సుధాకర్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కోర్ట్ నిర్మాణానికి నిధులు మంజూరు..

## - ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు..

**పెద్దపల్లి:** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చేందుకుగాను పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా కోర్టు భవన సముదాయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 81 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో 10౦2 కోర్ట్ కాంప్లెక్స్, ఫ్యామిలీ కోర్ట్, పోక్సో పోర్ట్ భవనాలను నిర్మించనున్నారని ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా కోర్టు ఏర్పడిందని, ఆ కోర్ట్ ప్రస్తుతం పాత కోర్ట్ భవనంలో కొనసాగుతున్నదని పేర్కొన్నారు. నూతన కోర్ట్ భవన నిర్మాణానికి కావలసిన స్థలాన్ని కూడా సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. ఎన్నికల సందర్భంగా కోర్ట్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి 81 కోట్ల నిధులు మంజూరు చేయించాను అని తెలిపారు. కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తం కుమార్ రెడ్డిలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అతి త్వరలో కోర్టు భవనానికి స్థల సేకరణ చేసి నూతన నిర్మాణాన్ని చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# పోలీస్ కమీషనరేట్ లో 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ ప్రాక్టీస్

### శాంతిభద్రతలను పరిరక్షించటమే మాబ్ ఆపరేషన్ డ్రిల్ ముఖ్య లక్ష్యం.



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** అక్రమంగా గుమ్మిగుడిన జన సమూహాలను కంట్రోల్ చేయుటకు, అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, (144) 163 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో ప్రజల శాంతి భద్రతల నేపథ్యంలో పోలీసులు ఏ విధంగా స్పందించాలి, అక్రమ జన సమూహాలను ఏ విధంగా చెదరగొట్టాలి అనే వ్యూహంలో భాగంగా రామగుండము పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి ఆదేశాల మేరకు రామగుండము పోలీస్ కమీషనరేట్ పరేడ్ గ్రౌండ్ లో ఎఆర్ ఎసిపి సుందర్ ఆధ్వర్యంలో గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ సివిల్, ఎఆర్ పోలీసులకు మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ ప్రాక్టీస్ నిర్వహించారు. ప్రజల, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తూ విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ, జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్న వాటిపై మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్ ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బందికి ఏసీపీ వివరించారు. మాబ్ ఆపరేషన్ డ్రిల్ లో ఓ వైపు ప్లకార్డులు చేతపట్టిన ఆందోళనకారులు, అల్లరి మూకలు మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేసేందుకు మొదటగా హెచ్చరికలు వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతి, ఉన్నతాధికారుల అనుమతితో భాష్పవాయువు ప్రయోగించడం, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించడం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీ ఛార్జీ చేపట్టడం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయడం అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటివి ఆర్ఐ దామోదర్, మల్లేశం, సంపత్ లు అర్ముడ్ సిబ్బంది డెమో ప్రదర్శన చేపించి తరువాత గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ సివిల్ సిబ్బందితో ప్రాక్టీస్ చేపించడం జరిగింది. మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశం శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు, ఘర్షణలు తలెత్తినప్పుడు శాంతిభద్రతలను పరిరక్షించడానికి పోలీస్ శాఖ ఎలా వ్యవహరిస్తుంది? ఘర్షణలకు పాల్పడిన వారిపై ఏవిధంగా చర్యలు తీసుకుంటారు? అనే దాని గురించి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో ఏ ఆర్ ఏసీపీ సుందర్ రావు, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు, గోదావరిఖని 2 టౌన్ ఇన్స్పెక్టర్, ఆర్ఐ లు దామోదర్, మల్లేశం, సంపత్, గోదావరిఖని సబ్ డివిజన్ ఎస్ఐ లు, పెద్దపల్లి సబ్ డివిజన్ ఎస్ఐ లు, ఆర్ఎస్ఐ లు అనిల్, పోచలింగం, ఏ ఆర్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడాకారిణి అభినందించిన జిల్లా కలెక్టర్



**అగ్నిధారన్యూస్,పెద్దపల్లి, నవంబర్ -23:** జిల్లా స్థాయి క్రీడాకారిణి తుమ్మల మనోజ్ఞ ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల 9వ తరగతి చదువుతున్న తుమ్మల మనోజ్ఞ అనే విద్యార్థి ఎస్.జి.ఎఫ్ అండర్ 17 జాతీయస్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక కావడం జరిగిందని, జాతీయ స్థాయి పోటీలు డిసెంబర్ 6 నుంచి 10వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్ లోని జమ్మూలో తెలంగాణ రాష్ట్ర తరపున మనోజ్ఞ పాల్గొంటుంది. ఈ సందర్భంగా శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష విద్యార్థిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యార్థికి అవసరమైన స్పోర్ట్స్ కిట్ అందిస్తామని తెలిపారు. విద్యార్థిని అభినందిస్తూ జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి పథకం తీసుకురావాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్ కుమార్ ,వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమురయ్య, మేకల సంజీవరావు పాల్గొన్నారు.

# రైతు ఖాతాల్లోకి బోనస్

### 8కోట్ల 46 లక్షల బోనస్ సోమ్ము రైతుల ఖాతాలలో జమ.

### 48 గంటల వ్యవధిలో ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నా%శీ.

### %ధాన్యం కొనుగోలుపై పత్రికా సమావేశం.

### అదనపు కలెక్టర్ డి.వేణు.



అగ్నిధారన్యూస్, పెద్దపల్లి, నవంబర్ -23:

పెద్దపల్లి జిల్లాలో సన్న రకం వడ్ల కు బోనస్ కింద ఇప్పటి వరకు 8 కోట్ల 46 లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందని అదనపు కలెక్టర్ డి.వేణు తెలిపారు. శనివారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ధాన్యం కొనుగోలు పై పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ...ఎద్దపల్లి జిల్లాలో 329 ధాన్యం కొనుగోలు ప్రతిపాదించి, 320 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఇప్పటివరకు 268 కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రారంభమైందని అన్నారు. రామగుండం, మంథని మొదలగు ప్రాంతాలలో కోతలు ఆలస్యంగా జరుగుతున్నాయని, అక్కడ మినహా ప్రతి చోట ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 వేల 829 మంది రైతుల నుంచి 189 కోట్ల 15 లక్షల రూపాయల విలువ గల 81 వేల 537.94 మెట్రిక్ టన్నుల (దొడ్డు రకం 31 వేల 701, సన్న రకం 49 వేల 836) కోనుగోలు చేసి ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేశామని, రైతులకు 80 శాతం మేర అనగా 151 కోట్ల 20 లక్షల రూపాయల ధాన్యం డబ్బులు వారి ఖాతాలలో జమ చేశామని తెలిపారు. సన్న రకం ధాన్యం క్వింటాలు ధాన్యానికి ప్రభుత్వం 500 రూపాయల బోనస్ ప్రకటించిందని, జిల్లాలో ఇప్పటి వరకు 4051 మంది రైతులకు 15 కోట్ల 34 లక్షల రూపాయలు బోనస్ ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసామని, ఇప్పటి వరకు 8 కోట్ల 46 లక్షల బోనస్ రైతులకు చెల్లించిందని అన్నారు. ప్రతి మండలానికి 2 ప్రత్యేక అధికారులను నియమించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పర్యవేక్షిస్తున్నామని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 33 రకాల సన్నరకం ధాన్యాన్ని వ్యవసాయ అధికారులు సర్టిఫై చేస్తున్నారని అన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడ్ క్లీనర్, తేమ యంత్రాలు, 334 హజ్ క్లీనర్, అవసరమైన గన్ని సంచులు అందుబాటులో పెట్టామని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద త్రాగు నీరు విద్యుత్ సౌకర్యం కల్పించామని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వ్యాధిగ్రస్తులను గుర్తించాలి





### హెల్త్ సూపర్వైజర్లకు శిక్షణ.

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అన్న ప్రసన్న కుమారి.

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి :** శనివారంరోజు జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో కుష్టు వ్యాధుల గుర్తింపు కార్యక్రమ%శీ% ను పురస్కరించుకొని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హెల్త్ సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమంలో నిర్వహించడం జరిగినదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పెద్దపల్లి డాక్టర్ జి అన్న ప్రసన్న కుమారి అన్నారు. ఈ కార్యక్రమంను డిసెంబర్ 2 నుండి డిసెంబర్ 15 వరకు 14 రోజులపాటు ఆశ వర్కర్స్ తో ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తిస్తారు అని అన్నారు. శరీరం రంగు కాకుండా చర్మంపై ఉన్న మచ్చలను ( అనుమానించి ) గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు పంపించి నిర్ధారణ చేపిస్తారని ఆ విధంగా ఈ వ్యాధి గల వ్యక్తులను గుర్తించి వారికి తగిన చికిత్స అందించి కుష్టు వ్యాధిని నివారించడం కొరకు చేపట్టే కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఆర్ రాజమౌళి, డాక్టర్ కె వి సుధాకర్ రెడ్డి, డాక్టర్ బి శ్రీరాములు దేవి సింగ్, సువార్త జిల్లా పారామెడికల్ ఆఫీసర్లు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రములకు చెందిన సూపర్వైర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా ప్రయోజనాలు కాపాడాలి



### ప్రజా అవసరాలు పరిశ్రమల ప్రతినిధులు కల్పించాలి

### పరిశ్రమల పరిధిలోని గ్రామాల్లో వసతుల కల్పించాలి

### ప్రజా ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకోవాలి.

### ఎన్టిపిసి, సింగరేణి, ఆర్.ఎఫ్.సి.ఎల్, కేశోరాం ప్రతినిధులతో సమావేశం

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.




**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి,నవంబర్ -23:-** పరిశ్రమల పరిధిలో గల గ్రామాలు, మున్సిపల్ ఏరియాలలో కనీస వసతుల కల్పన బాధ్యత గా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ పరిధిలో ఎన్టిపిసి, సింగరేణి, ఆర్.ఎఫ్.సి.ఎల్, కేశోరాం సిమెంట్ ప్రతినిధులతో కన్వర్జెన్స్ సమావేశం స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.... జిల్లాలో ఎన్టిపిసి, సింగరేణి , కేశోరం సిమెంట్, ఆర్.ఎఫ్.సి.ఎల్ పరిశ్రమల పరిధిలో ఉన్న గ్రామాలలో పారిశుధ్యం, త్రాగు నీటి సరఫరా, స్ట్రీట్ లైట్స్ మొదలగు అంశాల బాధ్యతను సదరు పరిశ్రమలు చేపట్టాల్సి ఉంటుందని కలెక్టర్ ఆదేశించారు. రామగిరి మండలం సెంటినరీ కాలనీలో త్రాగు నీటి సరఫరా పనులకు ప్రతిపాదనలు తయారు చేసే సమర్పించాలని కలెక్టర్ ఈఈ మిషన్ భగీరథ గ్రిడ్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. .

## రెండు కేసులలో ఇద్దరు నిందితులు అరెస్టు

**జోగులాంబ గద్వాల :** రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఆరు లక్షలు తీసుకున్న పసుల అంకిత అనే మహిళ, జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఆఫీస్ ముందు కారు అద్దాలు పగల కొట్టి 3,60,000 నగదు దొంగతనం చేసిన నెల్లూరు జిల్లా కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన ప్రసంగి అనే వ్యక్తి ని పోలీసులు అరెస్టు చేసారు. ప్రసంగి నుంచి ,3,10,000 నగదు రికవరీ చేసారు. వీళ్ళిద్దరిని కూడా శనివారం రిమాండ్ కు తరలిస్తున్నట్టు ఎస్పీ తోట శ్రీనివాసరావు తెలిపారు. దొంగతనం చీటింగ్ కేసులను ఛేదించిన పోలీసులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి సత్యనారాయణ ,గద్వాల సీఐ శ్రీనివాస్ గద్వాల పట్టణ ఎస్సై కళ్యాణ్ రూరల్ ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు

## కాంగ్రెస్ గారడీలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదు

**హైదరాబాద్ :** మహారాష్ట్రలో 5 గ్యారంటీల పేరిట కాంగ్రెస్ చేసిన గారడీ ప్రజలు నమ్మలేదు అని స్పష్టం అయ్యిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ మోసాలను మహారాష్ట్ర ప్రజలు గుర్తించి గుణపాఠం చెప్పారు. తెలంగాణలో మహిళలకు ?2,500 ఇస్తామన్న మహాలక్ష్మి పథకం అమలు చేయకుండా మహారాష్ట్ర లో ?3,000 ఇస్తామనడం, రైతు భరోసా ఎగ్గొట్టడం, ఆసారా ధోఖ, రైతు రుణమాఫీ ఏడాది గడుస్తున్నా పూర్తి చేయకపోవడం వంటివి మహారాష్ట్ర లో తీవ్ర ప్రభావం చూపెట్టాయి. తెలంగాణ ప్రజలు మహారాష్ట్ర లోని ముంబయి, షోలాపూర్ , పూణే, నాందేడ్ వంటి ప్రాంతాల్లో అత్యధికంగా నివసిస్తుండడం వలన కాంగ్రెస్ మోసాలు విరివిగా మహారాష్ట్ర లో ప్రచారం అయ్యాయి అనేది సుస్పష్టమయిదని అన్నారు. బీజేపీ పార్టీ ని హేమంత్ సోరేన్ పై పెట్టిన అక్రమ కేసులు, అరెస్టులు, పార్టీ చీల్చే ప్రయత్నాలను జార్ఖండ్ ప్రజలు తిప్పి కొట్టారు. బీజేపీ కక్ష సాధింపు విధానాలని ప్రజలు హర్శించడం లేదని తేలిపోయింది. విజయం సాధించిన హేమంత్ సోరేన్ కు శుభాకాంక్షలని అన్నారు.

## సీఎం రేవంత్ లో జలమండలి, ఇరిగేషన్ ఉన్నతాధికారుల భేటీ

**హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి తో జూబ్లీహిల్స్ నివాసంలో జలమండలి, ఇరిగేషన్ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీ ల గోదావరి జలాల తరలింపు పైన సమీక్ష జరిపారు. కొండపోచమ్మ , మల్లన్న సాగర్ ప్రాజెక్టు ల నుంచి నీటి తరలింపు పైన సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ ప్రాజెక్టు నుంచి నీటి తరలింపునకు ఎంత వ్యయం అవుతుంది, నీటి లభ్యత పైన పూర్తి అధ్యయనం చేయాలని సూచించారు. వచ్చే నెల 1 తేదీ వరకు టెండర్లకు వెళ్లేలా కార్యచరణ రూపొందించాలి. మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఈ సమీక్ష లో మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ సెక్రటరీ ప్రశాంత్ జె. పాటిల్, ఇతర అధికారులు పాల్గోన్నారు.

## ఆ విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి

**హైదరాబాద్ :** గురుకుల పాఠశాలల విద్యార్థుల ప్రాణాలు కాపాడేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం 10 నిమిషాలైనా సమయం కేటాయించాలని, ఫుడ్ పాయిజన్, కరెంట్ షాక్, ఆత్మహత్యలతో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు 10 లక్షల ఎక్స్రేషియా చెల్లించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. శనివారం నిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్న వాంకిడి రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిని శైలజాను కవిత పరామర్శించారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పోస్టర్ ఆవిష్కరణ

### హుజురాబాద్ ఇన్చార్జి వొడితల ప్రణవ్

**జమ్మికుంట :** ఈ నెల 27,28 వ తేదీల్లో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహా పాదయాత్ర సందర్భంగా, హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు, సమక్షంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వొడితల ప్రణవ్, మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారుల కృషి మరువలేనిదని గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులను వాడుకొని వదిలేశారని, కానీ తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో ఉద్యమకారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించడం జరిగిందని అన్నారు. తెలంగాణలో సబ్బండ వర్గాల సంక్షేమం కోసమే తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎక్కటి సంజీవ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం యువజన కో కన్వీనర్ అన్నం ప్రవీణ్, నియోజక వర్గం అధ్యక్షులు ఊకంటి మల్లాచారి, రావుల రాజ బాబు, ఆరె రమేష్ రెడ్డి, వినయ్, శ్రీకాంత్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు...

## ములాయంసింగ్ జయంతి వేడుకలు

**హైదరాబాద్ :** ఉత్తర ప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ నాయకుడు ములాయం సింగ్ యాదవ్ 85వ జయంతి వేడుకలు హైదరాబాద్ లో అట్టహాసంగా జరిగాయి. గ్రేటర్ హైదరాబాద్ సమాజ్ వాదీ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఈ వేడుకలను నిర్వహించారు. సమాజ్ వాదీ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ నేతలు నిత్య కళ్యాణ్, నర్సింగ్ మాదిగ కలిసి ములాయం సింగ్ జయతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ములాయం సింగ్ యాదవ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రేటర్ హైదరాబాద్ కు చెందిన పలువురు నాయకులు, పార్టీ కార్యకర్తలు ఈ సెలబ్రేషన్స్ లో పాల్గొన్నారు. ములాయం సింగ్ యాదవ్ జయంతి వేడుకల సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.. ఫుట్ పాత్ మీద ఉన్న అభాగ్యులకు, పేదవారికి, క్యాన్సర్ రోగులకు, భోజనాలను అందించారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com